# శ్రీ లలితా సహస్రనామ ప్రశ్నోత్తర మాలిక



## శ్రీ లలితా సహస్రనామ భాష్యం

వ్యాఖ్యానం: పూజ్యగురుదేవులు వాచస్పతి

బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారు

"శ్రీ గురుభ్యోనమః" విద్యార్థిని విద్యార్థుల సేకరణ

www.gurujnanam.org



విషయ సూచిక

| CD# | | పుట సంఖ్య |
|---|---|---|
| 1.7 | | |
| | సమయాచార ఉపాసన | 1 |
| | గ్రంథిభేదనం | 2 |
| | భవానీ ఉపాసన ఫలం | 5 |
| | శాంభవీ విద్య | 7 |
| 2.1 | | |
| | నిర్గుణ బ్రహ్మం | 10 |
| | అమ్మవారి ఫల నామాలు | 12 |
| | దుర్గా ఉపాసన | 15 |
| 2.2 | | |
| | సర్వమంత్రస్వరూపిణి | 19 |
| | త్రిపురా వైభవం | 21 |
| 2.3 | | |
| | మహామాలా నామాలు మొదటి భాగం | 23 |
| | మహా సిద్ధయే మహా త్రిపుర సుందరి | 29 |
| | చతుష్షష్ట్యుపచారాఢ్యా నామం నుండి చక్రరాజనికేతనా నామం వరకు | 32 |
| 2.4 | | |
| | నామ వైభవం | 34 |
| | చంద్ర విద్య | 35 |

gurujnanam

## సమయాచార ఉపాసన

1. మూలాధారం నుండి ఆజ్ఞాచక్రం వరకు ఉన్న షట్చక్రములకు మరొక పేరు ఏమిటి?

జ. మూలాధారం నుండి ఆజ్ఞాచక్రం వరకు ఉన్న షట్చక్రములకు మరొక పేరు షట్కమలములు.

2. “కౌళినీ, కులయోగినీ, అకులా" నామాలలో కులం, అకులం అనగా ఏమిటి?

జ. మూలాధారం నుండి ఆజ్ఞాచక్రం వరకు ఉన్న షట్చక్రములన్నీ కలుపుకుంటే కులము. అకులం అంటే సహస్రారం.

3. కులమునందు ఉన్న శక్తి  అకులం వైపు చేరు ప్రయాణమును ఏమని అంటారు?

జ. కులమునందు ఉన్న శక్తి అకులం వైపు ప్రయాణం మొదలు పెట్టింది. ఈ మార్గమును కౌళినీ అని అంటారు.

4. కులకుండము అనగా ఏమిటి?

జ. మూలాధార స్థానమును కులకుండము అని అంటారు.

5. గ్రామ దేవతల, కుల దేవతల రూపాలలో ఉన్న వారు ఎవరు?

జ. పరాశక్తియే గ్రామ దేవతల, కుల దేవతల రూపాలలో ఉండి మనల్ని అనుగ్రహిస్తోంది.

6. కుండలినీ రూపమైన యోగదేవత పేరు ఏమిటి?

జ. కుండలినీ రూపమైన యోగదేవతను “కులయోగిని" అని అంటారు.

7. శ్రీ చక్రములో యోగినీ దేవతలు అంటే ఎవరు?

జ. శ్రీ చక్రంలో త్రైలోక్యమోహన చక్రం నుండి బిందుచక్రం వరకు ఉన్నటువంటి శక్తులన్నిటినీ కలిపి యోగినీ దేవతలు అని అంటారు.

8. "అకులా సమయాంతస్థా" అన్న నామములలో 'సమయం' అనగా ఏమిటి?

జ. శివ శక్తుల సమత్వాన్ని సమయం అంటారు.

9. సమయాచారం అనగా ఏమిటి?

జ. శివ, శక్తులని అభేద దృష్టితో ఆరాధన చేయడం సమయాచారం.

10. శివ, శక్తుల సామ్యములు ఎన్ని విధములు?

జ. శివ, శక్తుల సామ్యములు మొత్తం పంచవిధములు. అవి 1). అనుష్ఠాన సామ్యము 2). అధిష్ఠాన సామ్యము 3). రూప సామ్యము 4). నామ సామ్యము 5). అవస్థా సామ్యము.



11. శ్రీ చక్రములో త్రికోణములన్నీ ఎవరు? బిందువులన్నీ ఎవరు?

జ. శ్రీ చక్రములో త్రికోణములన్ని శక్తి, బిందువులన్ని శివుడు.

12. కామాక్షి అమ్మవారిని చూస్తున్నపుడు, శివుడు ఎక్కడ ఉన్నాడు?

జ. శివుడు ఎక్కడో లేడు. ఆవిడలోనే ఉన్నాడు. చంద్రలేఖ, త్రినేత్రాలు అయ్యవారి లక్షణాలు. ఆ ఎర్రదనం, ఉన్నత వక్షస్థలం, స్త్రీ తత్త్వము అమ్మవారు. దీనినే "రూప సామ్యం" అని అంటారు.

13. మనం ఈ జన్మలోనే అమ్మను పొందాలి అంటే, సాధన ఎన్ని విధాములుగా జరగాలి?

జ. మనం ఈ జన్మలోనే అమ్మను పొందాలి అంటే సాధన రెండు విధములుగా జరగాలి. అవి బహిర్యాగము, అంతర్యాగము.

14. మనం ఎదురుగా శ్రీచక్ర ఆరాధన చేస్తున్నాము. ఇది పరా ఆరాధన లేక అపరా ఆరాధనా?

జ. మనం ఎదురుగా చేస్తున్న శ్రీచక్ర ఆరాధనను అపరా (అంటే బాహ్య) ఆరాధన అంటారు.

15. అంతర్యాగము ఎన్ని విధములుగా ఉంటుంది?

జ. అంతర్యాగము మూడు విధములుగా ఉంటుంది. అవి :1). అంతర 2). అంతరతర 3). అంతరతమ.

## గ్రంథిభేదనం

16. బ్రహ్మగ్రంథి భేదనం ఎక్కడ జరుగుతుంది?

జ. బ్రహ్మగ్రంథి భేదనం స్వాధిష్టానానికి పైన జరుగుతుంది.


17. యోగపరంగాగాని, జ్ఞాన పరంగాగాని ఉన్నత స్థితి ఎలా తెలుస్తుంది?

జ. సాధకుడు నిరంతరం జపరూపంలోనో, భక్తిరూపంలోనో, జ్ఞాన రూపంలోనో ఆ పరతత్త్వాన్నే కనుక చింతనచేస్తూ ఉంటే క్రమంగా ప్రాపంచిక బంధంనుంచి పైకి వెళుతూ

ఉంటాడు. వేదాంత మార్గంలో అయితే ప్రాపంచిక విషయ వాసనలని విడిచి పెట్టడం, యెగమార్గంలో అయితే ఒకొక్క గ్రంథిని భేదించుకుంటూ వెళుతూ ఉండడం.

18. జీవునికి ఎన్ని శరీరాలు ఉన్నాయి?

జ. జీవునికి మూడు శరీరాలు ఉన్నాయి - అవి స్థూల శరీరం, సూక్ష్మ శరీరం, కారణ శరీరం.



19. జీవునికి మోక్షం ఎప్పుడు వస్తుంది?

జ. జీవుడు మరణించిన తరువాత వదిలేది స్థూలశరీరం మాత్రమే. స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు వదిలినప్పుడే జీవునికి మోక్షం వస్తుంది.

20. బ్రహ్మగ్రంథి భేదనం జరిగినప్పుడు యోగి స్థితి ఏమిటి?

జ. మూలాధారంలో ఉన్న కుండలినీ పైకి లేచిన యోగికి జాగ్రదావస్థలో ఉన్న స్థూలశరీరం నేను కాదు, కనిపించే ప్రాపంచిక విషయాలు ఏవీ సత్యముకావు, ఇది మిథ్య అన్న భావం కలుగుతుంది.

21. షట్చక్రాలలో విశ్రామ స్థానాలు ఏవి?

జ. షట్చక్రాలలో విశ్రామ స్థానాలు మూలాధారం, మణిపూరం, ఆజ్ఞాచక్రం.

22. కుండలిని ఎక్కడ ఉదయిస్తుంది?

జ. కుండలిని మణిపూర చక్రంలో ఉదయిస్తుంది.

23. గ్రంథులు ఎన్ని? అవి ఏవి?

జ. గ్రంథులు మూడు. అవి బ్రహ్మ గ్రంథి, విష్ణు గ్రంథి, రుద్ర గ్రంథి.

24. 'విష్ణుగ్రంథివిభేదినీ' అనగానేమి?

జ. విష్ణుగ్రంథి అనాహతానికి పైన ఉంటుంది. బ్రహ్మగ్రంథి భేదనం అయిన యోగికి స్వప్నావస్థలో ఉన్న సూక్ష్మ శరీరం నేను కాదు అని అనుభవంలోకి రావడమే విష్ణుగ్రంధివిబేధినీ.

25. అమ్మవారు కుండలిని ప్రస్థానం లో ఎక్కువసేపు ఏ చక్రం దగ్గర ఉంటారు?

జ. ఆజ్ఞాచక్రం దగ్గర అమ్మవారు ఎక్కువసేపు ఉంటారు.

26. ఏ గ్రంథి భేదనం జరుగగానే సాధకుడు సుషుప్తి అవస్థలోనున్న కారణశరీరం తాను కాదు అని అనుకుంటాడు? అప్పుడు ఏమవుతాడు?

జ. రుద్రగ్రంధి భేదనం జరుగగానే కారణ శరీరం నేను కాదు అని తెలియగానే చైతన్యంగా మారిపోతాడు. సహస్రార స్థానంలో ఉన్న పరమాత్మతో ఐక్యం అవుతాడు.

27. జీవుడు ముక్తుడు ఎలా అవుతాడు?

జ. మూడు శరీరాలు అంటే స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు నేను కాను, ఇందులో ఉన్న చైతన్యమే నేను అని అనుకున్నవాడు ముక్తుడు అవుతాడు.

28. గ్రంధి భేదనం అయిన తరువాత ఏమి జరుగుతుంది?

జ. గ్రంధి భేదనం అయిన తరువాత జీవభావం పోతుంది.

29. జీవన్ముక్తుడు అంటే ఎవరు?

జ. జీవన్ముక్తుడుకి ప్రారబ్ధవశాత్తు శరీరం ఉంటుంది. ఆ స్థితికి వెళ్ళిపోయినవాడికి శరీరం ఉన్నా శరీరం నేను అన్న భ్రాంతిలో ఉండడు. వాడు తన శరీరంను ఇతరుల శరీరాలలో ఉన్న చైతన్యాన్ని ఒక్కలాగే చూస్తూ ఉంటాడు. ఇలా చూడగలిగినవాళ్ళే జీవన్ముక్తులు.

30. అసలైన గురువులు అంటే ఎవరు?

జ. శివశక్తులే అసలైన గురువులు. మన సహస్రార కమలంలో వారి పాదుకలు ఉంటాయి. గురువు అంటే శివశక్తులే, "శ్రీ గురు: సర్వ కారణ భూతాశక్తి:" (భావనోపనిషత్తు).

31. అమృతధార ఎక్కడ ఉంటుంది? దానిని ఎవరు పిండగలరు?

జ. అందరికీ ఆ శక్తి సహస్రారకమలంలో ఉంటుంది. యోగి తన శరీరంలో, మూలాధారంలో ఉన్న కుండలినిని సుషుమ్న ద్వారా షట్చక్ర భేదనం చేయించి సహస్రార కమలంలో ఉన్న ఆ అమృతాన్ని పిండుకుంటాడు.

32. హృదయంలో భావించే (అంతర) సాధనని ఏమంటారు?

జ. హృదయంలో భావించే సాధనని "సమయము"అంటారు. అక్కడ "శివశక్తు"లను ఏకంగా చూడాలి. అదే సమయాచారము. దీనినే అంతర సాధన అంటారు.

33. 'మూలాధారైకనిలయా' అన్నది ఏ విధమైన సాధన?

జ. 'మూలాధారైకనిలయా' అన్నది అంతరతర సాధన.

34. 'సహస్రారాంభుజారూఢా సుధాసారాభివర్షిణి' అన్నది విధమైన సాధన?

జ. 'సహస్రారాంభుజారూఢా సుధాసారాభివర్షిణి' అని అన్నది అంతరతమ సాధన.

35. సహస్రారానికి మరోపేరు ఏది?

జ. సహస్రారానికి మరోపేరు "అర్చిమద్వారం".

36. విశ్వమంతా వ్యాపించిన తల్లిరూపాన్ని ఏ రూపం అని అంటారు?

జ. "ఆద్యండరూపం" అని అంటారు.

37. అమ్మవారి ఆదిదైవిక రూపంఏది?

జ. ఆదిదైవిక రూపం "గౌరి".

38. సుషుమ్నలో అమ్మవారిని ఎలా ధ్యానం చెయ్యాలి?

జ. సుషుమ్నలో అమ్మవారిని మెరుపు తీగలా ధ్యానం చెయ్యాలి. ఆవిడ అక్కడ తామరతూడులోని దారంలా ఉంది. దాన్నే "పరచితిం భావయేత్" అంటారు.

39. మోక్షాన్ని ఎలా పొందుతారు?

జ. తనలో ఉన్న అఖండ ఆత్మశక్తిని దర్శించగలిగితే అదే మోక్షం.

40. సాధన అనగానేమి?

జ. సాధన అనగా ఉన్నాడని తెలిసిన భగవంతుడిని వెదకడం, అన్వేషించడం.

41. లలితా సహస్రనామాల్లోని మొదటి నూటపదకొండు నామాలను ఏమంటారు?

జ. లలితా సహస్రనామాల్లోని మొదటి నూటపదకొండు నామాలను "మూలగ్రంథం" అంటారు . ఇదే అసలు గ్రంథం. ఇక్కడివరకు చదివితే లలితా సహస్రనామం మొత్తం చదివినట్లే. ఈ నూటపదకొండు నామాలని "ప్రకరణ గ్రంథం"అని కూడా అంటారు.

42. అమ్మవారి రూపములు ఎన్ని? అవి ఏవి?

జ. అమ్మవారి రూపములు మూడు అవి 1) ఆద్యండ రూపం 2) గౌరి (ఆదిదైవిక రూపం) 3) శరీరమునందు కుండలినీ (ఈ మూడు అమ్మవారి రూపములు కావ్యకంఠవాశిష్ఠ గణపతిముని తన ఉమాసహస్రంలో చెప్పారు).

## భవానీ ఉపాసన ఫలం

43. శాంభవీ విద్య అని దేనిని అంటారు?

జ. శ్రీ లలితాసహస్ర నామాల్లో భవానీ నామము నుంచి శాంతిమతీ నామము వరకు వచ్చే నామాలను శాంభవీ విద్య అని అంటారు (ఇరవై నామాలు, 112 to 131).

44. శాంభవీవిద్యకు అధిదేవత ఎవరు?

జ. శాంభవీవిద్యకు అధిదేవత భవాని.

45. ప్రాణశక్తిని పెంపొందించే నామాలు ఏవి?

జ. 'భ'కార బాహుళ్యం ఉండే నామాలు ప్రాణశక్తిని పెంపొందిస్తాయి.

46. వత్సరాజు ఏ స్తోత్రంలో భవానీ నామం గురించి చెప్పారు?

జ. చర్చాస్తవం.

47. మంత్రము చేసేటప్పుడు ఎన్ని భావనలు ఉండాలి?

జ. మంత్రము చేసేటప్పుడు రెండు భావనలు ఉండాలి. 1)శబ్ద భావన 2) అర్థ భావన.

48. ఉపాసన చేసేటప్పుడు ఎన్ని భావనలు ఉండాలి?



జ. ఉపాసన చేసేటప్పుడు మూడు భావనలు ఉండాలి. అవి: 1) బ్రాహ్మీ భావన (ఆ దేవత దివ్యమంగళ విగ్రహాన్ని భావించడం) 2) అక్షర భావన (మంత్రమును శబ్దార్థ భావంతో చేయడం) 3) మహేశ్వర భావన (రూపానికి, మంత్రానికి కూడా మూలం అయిన తత్త్వాన్ని విచారణ చేయడం).

49. భావనా యోగం అంటే ఏమిటి?

జ. జ్ఞానేంద్రియాలు నిగ్రహించి మనస్సు భగవంతుడిపై పెడితే అదే భావనా యోగం.

50. భవానీ నామానికి అర్థం ఏమిటి?

జ. భవానీ అంటే భవుని శక్తి.  ఏ తల్లి ప్రపంచమంతా వ్యాపించి ఉన్నదో, ప్రపంచాన్ని కలుగిస్తున్నదో, ఏ తల్లి వల్ల ప్రపంచము ఉంటూ, ప్రపంచం కలుగుతూ, లయం అవుతున్నదో ఆ శక్తినే భవాని అంటారు.

51. "భవారణ్యకుఠారికా" అనే నామానికి అర్థం ఏమిటి?

జ. "భవారణ్యకుఠారికా" అనే నామానికి భవ-అరణ్య-కుఠారికా అనేది పద విభజనం. సంసారమనే అడవిని సమూలంగా పెకలించేగలిగే గండ్రగొడ్డలి శక్తియే అమ్మ, అంటే ముక్తిని ఇచ్చే దేవత.

52. కుఠారికా అనే నామంలో దాగివున్న మంత్రాలు ఏవి?

జ. కుతారికా అనే నామంలో ప్రకట మరియు గుప్త గాయత్రీ మంత్రములు దాగి ఉన్నాయి.

## శాంభవీ విద్య

53. భద్రములు అనగానేమి?

జ. భద్రములు అనగా శుభము, మంగళము.

54. భద్రమూర్తి అనగానేమి?

జ. భద్రమూర్తి అనగా మంగళకరమైన రూపము కలిగినది అని అర్థము.

55. భద్రమండలము అనగానేమి?

జ. దేవతామండలమంతా (దేవతాసమూహము) ఒకే చోట ఉంటే దాన్ని భద్రమండలమని అంటారు.

56. భద్రమైన పద్ధతులతో అమ్మవారిని ఆరాధన చేయటంవల్ల కలిగే ప్రయోజనం ఏమిటి?

జ. భక్తులకు సౌభాగ్యములు ఇస్తుంది- భక్తసౌభాగ్యదాయిని.

57. భక్తులు ఎవరు? భక్తి అనగానేమి?

జ. భక్తులు అంటే ఆశ్రయించువారు. భగవద్ధర్మములయందు మనస్సు అతివేగంగా ఆగకుండా ప్రవహిస్తే దాని పేరే భక్తి.

58. అమ్మవారిని పొందడానికి ప్రధానమైన సాధన ఏమిటి? దానికి సంబంధించిన నామములు ఏమిటి?

జ. అమ్మవారు భక్తసౌభాగ్యదాయిని. ఆవిడని పొందడానికి ముఖ్యమైన సాధన భక్తి. దానికి సంబంధించిన నామములు భక్తిప్రియ, భక్తిగమ్య, భక్తివశ్య.

59. మూడు రకాల భయాలు ఏవి? భయములు పోగొట్టే నామములు ఏమిటి?

జ. ఆధ్యాత్మిక, ఆదిభౌతిక, ఆదిదైవిక భయములు. ఈ భయాలను పోగొట్టే అమ్మవారి నామం "భయాపహ".

60. అమ్మవారి నామాలను ఎన్ని విధములుగా గ్రహించాలి?

జ. అమ్మవారి నామాలను మూడు విధములుగా గ్రహించాలి. అవి ప్రతినామంలో ఉన్న వ్యవహారార్థం, ఉపాసనార్థం మరియు పరమార్థం.

61. భవానీ పంచభూతాల్లో __ స్వరూపము. (ఖాళీని పూరించండి)

జ. జల.

62. భవానీ నామానికి మరొక పేరు?

జ. ఉష.

63. శంభు అంటే ఏమిటి?

జ. శంభు అంటే శాంతి శుభములకు మూలమైనవాడు అని అర్ధము.

64. శంభుని శక్తి ఎవరు?

జ. శంభుని శక్తి శాంభవి.

65. సుఖము శాంతము శుభములను ఇచ్చే తల్లి నామము ఏమిటి?

జ. సుఖము శాంతము శుభములను ఇచ్చే నామము శాంభవి.

66. శాంభవీ స్థితి అంటే ఏమిటి?

జ. శాంభవీ స్థితి అంటే ప్రపంచాన్ని సాక్షీభూతంగా చూస్తూ లోపల ఉన్న పరమాత్మపైనే దృష్టి పెట్టడం.

67. శరత్కాలంలో ఆరాధింపబడేది కావున వచ్చిన అమ్మవారి నామము?

జ. శరత్కాలంలో ఆరాధింపబడేది కావున 'శారదారాధ్యా'.

68. ప్రసన్నభావనమును తెలియజెప్పే అమ్మవారి నామము ఏమిటి?

జ. ప్రసన్నభావనమును తెలియజెప్పే అమ్మవారి నామము "శారద".

69. సర్వజగత్తుని తనలో లీనం చేసుకునేవాడు ఎవరు?

జ. సర్వజగత్తుని తనలో లీనం చేసుకునేవాడు శర్వుడు.

70. భూమి రూపంలో ఉన్న శివుడు ఎవరు? ఆయన పత్ని ఎవరు?

జ. భూమి రూపంలో ఉన్న శివుడు శర్వుడు. ఆయన పత్ని శర్వాణి. శర్వాణికి మరొక పేరు సుఖేశీ.

71. శర్మ అని ఎవరిని అనాలి?

జ. ఇంద్రియ సుఖములు కాకుండా ఇంద్రియాతీతమైన జ్ఞానానందమును కోరుకునేవానిని శర్మ అంటారు.

72. "శర్మదాయినీ" అనగానేమి?

జ. భౌతిక సుఖాలు ప్రధానము కావు, బ్రహ్మానందం ప్రధానం. అదే జ్ఞానము. ఆ జ్ఞానానందం ఇచ్చే తల్లియే "శర్మదాయిని".

73. అన్ని రకాల లక్ష్ములను ఐశ్వర్యములను ఇచ్చు తల్లి ఎవరు?

జ. అన్ని రకాల లక్ష్ములను ఐశ్వర్యములను ఇచ్చు తల్లి "శ్రీకరి".

74. "సాధ్వీ" అనే అమ్మవారి నామమునకు అనేక అర్ధములు తెలపండి?

జ. "సాధ్వీ" అంటే మహాపతివ్రత, చక్కని మార్గములకు (అంటే సాంప్రదాయ పద్ధతులు) గమ్యమైన తల్లి మరియు వేదమాత అని అర్థం.

75. హిమవత్పర్వత రాజపుత్రి ఎవరు?

జ. హిమవత్పర్వత రాజపుత్రి శాతోదరి.

76. శాంభవీ విద్యలో ఉపాస్య దేవత ఎవరు?

జ. శాంభవీ విద్యలో ఉపాస్య దేవత భవాని.

77. భవానీదేవి ఇచ్చే అనుగ్రహఫలం తెలియజేసే నామములు ఏవి?

జ. భవానీదేవి ఇచ్చే అనుగ్రహఫలం తెలియజేసే నామములు శర్మదాయిని, భక్తసౌభాగ్యదాయిని, భయాపహా, శ్రీకరి.

78. లలితా అమ్మవారి స్వరూపమును /స్వభావమును తెలియజేసే నామములు ఏవి?

జ. లలితా అమ్మవారి స్వరూపమును తెలియజేసే నామములు శాంకరి, శాంభవి, మరియు శర్వాణి.

79. శ్రీ అనగానేమి?

జ. శ్రీ అనగా ఐశ్వర్యము, సుఖము, జ్ఞానము, మోక్షము మరియు అమృతస్వరూపిణి అని అర్థము.

80. శరత్కాలమునాటి పూర్ణిమ చంద్రుని వంటి అందమైన ముఖము కల అమ్మవారిని ఏమని పిలుస్తారు?

జ. శరత్కాలమునాటి పూర్ణిమ చంద్రుని వంటి అందమైన, ప్రకాశవంతమైన ముఖము కలది కావున శరత్చంద్రనిభాననా (రూపవర్ణన).

81. భవానీ దేవతకు అంగదేవతలు ఎవరు?

జ. శాంభవి, శర్వాణి, సాధ్వి, శరత్చంద్రనిభానన, శాతోదరి మరియు శాంతిమతి.

82. శాంభవీ విద్య యొక్క ఫలితం చెప్పే నామాలు ఏమిటి?

జ. శర్మదాయిని, శాంకరి, శ్రీకరి.

83. శాంతముతో (జ్ఞానముతో) కూడిన మానసముతో ఉన్న అమ్మను ఏమని పిలుస్తారు?

జ. శాంతముతో (జ్ఞానముతో) కూడిన మానసముతో ఉన్న అమ్మను "శాంతిమతీ" అని పిలుస్తారు.

## నిర్గుణ బ్రహ్మం

84. 'భవాని' నుంచి 'శాంతిమతి' వరకు ఉన్న మంత్ర సమూహాన్ని ఏమంటారు?

జ. 'భవాని' నుంచి 'శాంతిమతి' వరకు ఉన్న మంత్ర సమూహాన్ని “శాంభవీ విద్య” అని అంటారు.

85. భవానీ విద్య తరువాత తెలుసుకోబోయే బ్రహ్మము ఏది?

జ. భవానీ విద్య తరువాత తెలుసుకోబోయే బ్రహ్మము జ్ఞేయబ్రహ్మము.

86. సగుణోపాసన, నిర్గుణోపాసనలను english లో ఏమంటారు?

జ. సగుణోపాసనని “meditation” అని, నిర్గుణోపాసనని “realization” అని అంటారు.

87."నిరాధారా" నుంచి "నిరీశ్వరా" దాకా ఉన్న రహస్య నామ సముదాయము సగుణమా? నిర్గుణమా?

జ. "నిరాధారా" నుంచి "నిరీశ్వరా" దాకా ఉన్న రహస్య నామ సముదాయము “నిర్గుణము”. దీన్ని వేదాంతము ద్వారా మాత్రమే తెలుసుకోగలుగుతాము. దీన్నే జ్ఞేయ బ్రహ్మము అని కూడా అంటారు.

88. ప్రపంచము ఎవరి వల్ల భాసిస్తోంది?

జ. ప్రపంచము పరమాత్మ ఉనికి చేత భాసిస్తోంది.

89. ఉపాసనలు ఎన్ని విధములు? అవి ఏవి?

జ. ఉపాసనలు మూడువిధములు. అవి : 1) రూప ఉపాసన 2) మంత్ర ఉపాసన 3) కుండలిని ఉపాసన.

90. నిర్గుణ బ్రహ్మను ఉపనిషత్తులు ఏమంటాయి?

జ. ఔపనిషద్ బ్రహ్మము.

91. ఔపనిషత్తు బ్రహ్మమును గురించి కూర్చిన నామాలు ఏవి?

జ. ఔపనిషత్తు బ్రహ్మమును కూర్చిన నామాలు “నిరాధారా" నుంచి "నిరీశ్వరా" వరకు.

92. అమ్మని "నిరాధారా" అని ఎందుకు అన్నారు?

జ. జగతికే ఆధారమైన అమ్మకి ఏ ఆధారమూ అవసరము లేదు కాబట్టి "నిరాధారా" అని అన్నారు.

93. "నిరంజనా", "నిర్లేపా" నామముల తత్త్వార్థము ఏమిటి?

జ. "నిరంజనా" అంటే అవిద్యలాంటి అంజనములు (అంజనము అంటే కాటుక) ఏవీ అంటనిది, "నిర్లేపా" అంటే కర్మ సంబంధము లేనిది.

94. ప్రపంచములో యోగి ఎలా ఉంటాడు?

జ. ప్రపంచములో యోగి తామరాకు మీద నీటిబొట్టులా ఉంటాడు. ("లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా" గీత 5.10).

95. మాలిన్యములు ఎన్ని రకాలు? అవి ఏవి?

జ. మాలిన్యములు మూడు రకాలు. అవి: 1) ఆనవ మాలిన్యము 2) కార్మిక మాలిన్యము 3) కాయిక మాలిన్యము.

96. ఆనవ మాలిన్యము అనగా ఏమి?

జ. ఆనవ మాలిన్యము అనగా జీవులకి ఇతర జన్మల నుండి వచ్చినటువంటి మాలిన్యం.

97. కార్మిక మాలిన్యము అనగా నేమి?

జ. ఈ జన్మలో కొత్తగా ఇప్పుడు చేస్తున్న కర్మలవల్ల వచ్చే మాలిన్యమును కార్మిక మాలిన్యము అంటారు.

98. "నిత్యా" అనే రహస్యనామము యొక్క అర్థము ఏమిటి?

జ. నిత్యా అంటే 1) మార్పు లేకుండా ఉండేది 2) ఆది, మధ్య, అంతం లేనిది 3) త్రికాలాల్లో ఉండేది అని అర్థం.

99. మనం ఆకార రూపముగా ఊహించి ధ్యానించే అమ్మవారిని "నిరాకారా" అని ఎందుకన్నారు?

జ. ఉపాసనా నిమిత్తం తనకు తానే ఆకారాన్ని ప్రకటించినప్పటికీ విశ్వమంతా వ్యాపించిన ఆ తల్లికి ఏ రూపము ఉండదు కనుక "నిరాకారా" అని అన్నారు.

100. 'నిరాకులా' అంటే అర్థం ఏమిటి?

జ. చిత్తచాంచల్యము లేని తల్లి అని అర్థం.

101. అమ్మవారి గురించి చెప్పే ఉపనిషత్తులు ఏవి?

జ. త్రిపురోపనిషత్తు, అరుణోపనిషత్తు, బహ్వృచోపనిషత్తు, భావనోపనిషత్తు, శ్రీ ఉపనిషత్తు (శ్రీ సూక్తము), దేవిఅథర్వశీర్షము మరియు దేవి ఉపనిషత్తులు.

102. అమ్మవారి రూప ధ్యానము ఏమిటి? తత్వధ్యానము ఏమిటి?

జ. అమ్మవారి రూపధ్యానము "సకల". తత్వధ్యానము "నిష్కళ".

103. త్రిపురోపనిషత్తులో నుంచి తీసుకుని లలితా సహస్రనామములలో కూర్చిన మూడు మంత్రములు ఏవి?

జ. త్రిపురోపనిషత్తులో నుంచి తీసుకుని లలితా సహస్రనామములలో కూర్చిన మూడు మంత్రములు "నిష్కళ", "నిశ్చల" మరియు "శాంత".

104. అందరి కోరికలు తీర్చే తల్లిని "నిష్కామ" అని ఎందుకు అన్నారు?

జ. అందరి కోరికలు తీర్చే తల్లికి ఏ కోరిక లేదు కాబట్టి "నిష్కామ" అని అన్నారు.

105. ఉపనిషత్తులు ప్రతిపాదించిన అమ్మవారి తత్వము ఏది?

జ. ఉపనిషత్తులు ప్రతిపాదించిన అమ్మవారి తత్వము "పరతత్వము".

106. "నిరీశ్వరా" నామార్ధం ఏమిటి?

జ. తనను శాసించే ఈశ్వరుడు లేని తల్లి "నిరీశ్వరా".

107. "నిరాధారా" నుంచి "నిరీశ్వరా" వరకు చెప్పబడిన బ్రహ్మము ఏది?

జ. "నిరాధారా" నుంచి "నిరీశ్వరా" వరకు చెప్పబడినది "జ్ఞేయ" బ్రహ్మము. ఇందులో 1) పరమార్థతత్వము 2) తత్వస్వరూపము 3) ఆత్మరూపము 4) బ్రహ్మరూపము చెప్పబడ్డాయి.

108. వివేకము అంటే ఏమిటి?

జ. వివేకం అంటే నిత్యానిత్య వస్తువులు అని  వేరు చేసి చూడగలిగే బుద్ధి.

## అమ్మవారి ఫల నామాలు

109. "నిరాధారా, నిరంజనా"నుంచి "నిష్క్రియా, నిష్పరిగ్రహా "వరకు ఉన్న నామాలను "నిశ్శబ్ద" నామాలని ఎందుకు అంటారు?

జ.' నిః ' ఉపసర్గ ఉన్నందు వలన వాటికి నిశ్శబ్ద నామాలని పేరు, కానీ అవి నిశ్శబ్దముగా (silent)

ఉండే నామాలు అని కాదు.

110. జీవుడికి ఉండే "దోషాలు"ఎన్ని? అవి ఏవి?

జ. పదిహేడు (17) దోషాలు. అవి: రాగం, మదం, మోహం, చింత, అహంకారం, మమత, పాపం, క్రోధం, లోభం, సంశయం, భవం/భయం, వికల్పం/చెదరిపోవుట, బాధ/మార్పు, భేదము, నాశము, క్రియ, పరిగ్రహము/స్వీకరించుట.

111. రాగం తొలగించే అమ్మవారి నామం ఏమిటి?

జ. "రాగమథని".

112. 'రాగము లేని అమ్మ' అని తెలిపే నామం ఏమిటి?

జ. "నీరాగ"

113. మదాన్ని తొలగించే అమ్మవారి నామం ఏమిటి?

జ. "మదనాశిని".

114. 'మదం లేని అమ్మవారు' అని తెలిపే నామం ఏమిటి?

జ. "నిర్మద".

115.'చింతా మరియు అహంకారం లేని అమ్మవారు' అని తెలిపే నామాలు ఏవి?

జ. "నిశ్చింతా", "నిరహంకారా".

116. చింత ఎలాంటిది?

జ. "చితా దహతి నిర్జీవం, చింతా దహతి సజీవం".

చింత బ్రతికి ఉన్నవారిని కూడా దహిస్తుంది.

117. "నిశ్చింతా" నామ విశ్లేషణ భగవద్గీతలో ఏ శ్లోకానికి సరిపోతుంది?

జ. "సర్వధర్మాన్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ! అహం త్వా సర్వపాపేభ్యః మోక్షయిష్యామి మా శుచః" (భగవద్గీత 18:66).

118. 'మోహము తొలగించే తల్లి' అని చెప్పే నామం ఏమిటి?

జ. "మోహనాశిని".

119. 'మోహము లేని అమ్మ' అని తెలిపే నామం ఏమిటి?

జ. "నిర్మోహా".

120. "మమ"అనే దోషాన్ని తొలగించే అమ్మ నామం ఏమిటి?

జ. 'మమతాహంత్రి'.

121. 'మమత్వం లేని అమ్మ' అని తెలిపే నామం ఏమిటి?

జ. "నిర్మమ".

122. 'పాపం తొలగించే అమ్మ' అని చెప్పే నామం ఏమిటి?

జ. "పాపనాశిని".

123. 'పాపము లేని అమ్మ' అని తెలిపే నామం ఏమిటి?

జ. "నిష్పాప".

124. "నిష్పాపా పాపనాశినీ" నామాలలో "పాపం" అనే పదానికి నిర్వచనం ఏమిటి?

జ. ఇక్కడ “పాపం” అంటే విధిని చేయకపోవటం, నిషేధాన్ని చేయటం.

125. అమ్మవారు పాపాలన్నీ ఎలా తీసేస్తుంది?

జ. ఎన్ని అపరాధాలు చేసినా “జగదాంబా”! అని పిలిస్తే చాలు, పాపములు మేరు పర్వతంలా ఉన్నా వెలుగు రాగానే చీకటి పోయినట్లు, పాపాలను క్షణంలో తీసేస్తుంది.

126. 'లోభమును తొలగించే తల్లి' అని చెప్పే నామం ఏమిటి?

జ. “లోభనాశిని”.

127. 'లోభము లేని తల్లి' అని తెలిపే నామం ఏమిటి?

జ. “నిర్లోభ”.

128. 'సంశయమును తొలగించే తల్లి' అని చెప్పే నామం ఏమిటి?

జ. “సంశయఘ్నీ”.

129. "సంశయము లేని తల్లి" అని తెలిపే నామం ఏమిటి?

జ. “నిస్సంశయ” .

130. నిర్భవా - భవనాశిని అయిన అమ్మ ఏమి తొలగిస్తుంది?

జ. భవ అంటే పుట్టుక. “భవనాశిని” అంటే పుట్టుకను లేకుండా చేసే తల్లి అని. “నిర్భవా” అంటే పుట్టుక లేని తల్లి అని. అమ్మకు పుట్టుకా లేదు సంసారమూ లేదు. అలాంటి అమ్మ మనకు ఆత్మజ్ఞానం ప్రసాదించి పుట్టుక మరియు సంసారం లేకుండా చేస్తుంది.

131. "నిర్వికల్ప" అయిన అమ్మ ఏమి తొలగిస్తుంది?

జ. మనసు సంకల్ప వికల్పాల సంఘాతం. మనసు వికల్పం అయినప్పుడు అమ్మని ప్రార్థిస్తే ఆ వికల్పం లేకుండా కాపాడుతుంది ఎందుకంటే ఆవిడకు ఏ వికల్పము లేదు.

132. ”మార్పులు లేని తల్లి"అని తెలిపే నామం ఏమిటి?

జ. "నిరాబాధ” .

133. “భేదములు లేని తల్లి" అని తెలిపే నామం ఏమిటి?

జ. "నిర్భేద".

134. భేదములు ఎన్ని రకాలు?

జ. భేదములు మూడు రకములు. అవి: 1) విజాతీయ (జంతువులు, మానవులు) 2) సజాతీయ (మనుష్యుల్లో ఆడ మగ ) 3) స్వగత (మనిషి యొక్క అవయవాలు).

135. ”మృత్యుమథనీ” నామఉపాసన ఫలితం ఏమిటి ?

జ. మృత్యుమథనీ - మృత్యువును తొలగించునది. గురువు గారు చెప్పినట్లు "ఏది అమృతమో అది నువ్వు తెలుసుకోనంతవరకు అది మృత్యువు. ఏది మృతమో అది 'నువ్వు' అని అనుకుంటున్నంతకాలం అదే మృత్యువు"!! అజ్ఞానం, ఏమరుపాటు, అజాగ్రత్తే మృత్యువు.

136. "నిష్క్రియా" నామపరమార్థం ఏమిటి ?

జ. "నిష్క్రియా" అంటే అమ్మ చైతన్యం వల్ల ఉపాధులు పని (క్రియ ) చేస్తాయి, కానీ ఈ ఉపాధుల పనులు /కర్మలు ఆవిడకు అంటట్లేదు.

137. "నిష్పరిగ్రహా" నామార్థం ఏమిటి ?

జ. "నిష్పరిగ్రహా" అంటే ఏది స్వీకరించదు అని. వ్యవహార అర్థం: మనసుతో కూడా దొంగతనం చెయ్యకుండా ఉండటం. పరమార్థం: లోక విషయాలు లోపలికి రానివ్వకపోవటమే 'నిష్పరిగ్రహా'. ప్రపంచంలో దేనినీ "నాది" అని లోపలికి తీసుకోకూడదు.

138. పదిహేడు దోషాలు పోగొట్టే నామాలలో చెప్పబడిన / దాగివున్న మంత్రాలు ఏవి?

జ. 1) హంస మంత్రం 2) షోడశాక్షరీ మంత్రం 3)ఏకాదశ రుద్ర మంత్రం 4) దక్షిణామూర్తి మంత్రం.

## దుర్గా ఉపాసన

139. "నిస్తులా" అను అమ్మ నామమునకు అర్థము ఏమి?

జ. అమ్మవారికి పోల్చదగిన వస్తువు ఏమీ లేదు కావున నిస్తులా అని అమ్మ నామానికి అర్థం.

140." నీలచికురా" అను నామమునకు అర్థమేమి?

జ. నల్లని ఒత్తైన జుట్టు కల తల్లి అని అర్థం.

141. అమ్మను ఎప్పుడూ ఎలా ధ్యానం చెయ్యాలి?

జ. పదహారు ఏళ్ళ వయస్సు గల నల్లని ఒత్తైన జుట్టుతో ఉన్న తల్లిగా ధ్యానించాలి.

142. అపాయములు ఎన్ని రకములు? అవి ఏవి?

జ. అపాయములు నాలుగు రకములు. అవి 1) ధన 2) విద్య 3) ఆరోగ్య 4) ప్రాణ అపాయములు.

143. "నిరపాయా "అను నామానికి అర్థం ఏమి?

జ. విద్య, ధన, ఆరోగ్య మరియు ప్రాణ అపాయములను తొలగించే తల్లి అని అర్ధము.

144. ఆశ్రయం అంటే ఏమిటి?

జ. అనుభవిస్తున్న ప్రతిదీ అమ్మ ఇచ్చినదే అని తెలుసుకోవడమే ఆశ్రయం.



145. "నిరత్యయా" అను నామానికి అర్ధం ఏమిటి?

జ. అమ్మను ఎవరూ అత్రిక్రమించలేరు, దాటలేరు అని అర్ధం.

146. పరతత్వం ఎటువంటిది?

జ. పరతత్వం దుర్లభమైనది మరియు దుర్గమమైనది.

147. దుర్లభ అనగానేమి?

జ. అతికష్టపడితే కానీ దొరకనిది దుర్లభ.

148. దుర్గమ అనగానేమి?

జ. మనస్సుకి, మాటకి దొరకని తత్వం దుర్గమ.

149. దుర్లభమైన, దుర్గమమైన పరతత్వానికి పేరు ఏమిటి?

జ. దుర్లభమైన మరియు దుర్గమమైన పరతత్వానికి పేరు "దుర్గ".

150. దుర్గ అను నామానికి వ్యవహారార్ధం ఏమి?

జ. దుర్గతులను తొలగించే తల్లి దుర్గ.

151. 'దుః' అనే శబ్దంతో వచ్చే దుర్గతులు ఏవి?

జ. 1) దుఃఖం 2) దుష్టత్వం 3) దుర్మార్గం 4) దురాచారం 5) దురితం 6) దుస్సాధ్యం 7) దుర్భేద్యం మొదలగునవి.

152. దుర్గతులు ఎన్ని? అవి ఏవి?

జ. దుర్గతులు పదకొండు. అవి 1). దైత్య 2). మహావిఘ్న 3). భవభంద 4). కుకర్మిణ 5). శోక 6). దుఃఖ 7). నరక 8). యమదండ 9). జన్మని 10). మహాభయ 11). రోగ.

153. దుర్గతులు పోవాలంటే ఏమి చెయ్యాలి?

జ. దుర్గతులు పోవాలంటే బుద్ధితో అమ్మను పట్టుకోవాలి, నోటితో అమ్మను జపించాలి, చేతులతో అమ్మను పూజించాలి (త్రికరణాలతో అమ్మని అందుకోవాలి).

154. ఆశ్రయించాల్సిన మరియు ఆశ్రయమైన శక్తి ఏది?

జ. ఆశ్రయించాల్సిన మరియు ఆశ్రయమైన శక్తి "దుర్గ".

155. "దుర్గ"అను నామానికి నిర్వచనం ఏమిటి? మరియు పారాయణ ఫలమేమిటి?

జ. దుర్గ అను నామానికి నిర్వచనం దుర్లభ మరియు దుర్గమ. ఆ నామ పారాయణ ఫలం దుఃఖహంత్రీ మరియు సుఖప్రద నామాలు.

156. వేదాంతమునందు దుర్గ ఎవరు?

జ. వేదాంతమునందు దుర్గ బ్రహ్మజ్ఞానం.

157. వేదమునందు దుర్గ ఎవరు?

జ. వేదమునందు దుర్గ యజ్ఞఫలదాయిని.

158. దుర్గం అనగానేమి?

జ. దుర్గం అనగా కోట.

159. దుర్గ అనగా ఎవరు (లీలార్థం)?

జ. దుర్గముడు అనే రాక్షసుణ్ణి చంపిన తల్లి దుర్గ.

160. దుర్గా ఆరాధన వల్ల ఫలితం ఏమి?

జ. దుర్గా ఆరాధనా వల్ల ఫలితం దుఃఖనాశనము మరియు సుఖము.

161. "ఖం"అను శబ్దానికి అర్థం ఏమి?

జ. "ఖం"అను శబ్దానికి ఆకాశం, ఇంద్రియం మరియు అనుభవం అని అర్థం.

162. దుఃఖం అనగానేమి?

జ. భరించలేని అనుభవానికి దుఃఖం అని అర్థం.

163. సుఖం అనగానేమి?

జ. హాయి అయిన అనుభవానికి సుఖం అని అర్థం.

164. మనవులని బంధించే పవర్గం అనగానేమి?

జ. ప: పుణ్యం, పాపం; ఫ:ఫలం; బ:బంధము; భ:భయం; మ:మరణం, వీటిని పవర్గం అంటారు.

165. 'ప' వర్గంతో బంధింపబడటం వల్ల కలిగేది ఎమిటి?

జ. పవర్గం కలిగివుండటమే ఆత్యంతిక దుఃఖం.

166. ఆత్యంతిక దుఃఖం తొలగిన స్థితి పేరు ఏమి?

జ. ఆత్యంతిక దుఃఖం తొలగిన స్థితి పేరు మోక్షం.

167. మోక్షం అంటే ఏమిటి?

జ. ఉపాధి తాదాత్మ్యం తొలగడమే మోక్షం.

168. దుష్టత్వం అనగా వేదాంత నిర్వచనం ఏమి?

జ. వేదాంత నిర్వచనం ప్రకారం దుష్టత్వం అనగా బహిర్ముఖత్వం.

169. "దుష్టదూరా" అను నామానికి అర్థం ఏమి?

జ. దుష్టులకు దూరంగా ఉండు తల్లి అని అర్థం.

170. దురాచారం అనగానేమి?

జ. శాస్త్ర విరుద్ధ ఆచారమే దురాచారం.

171. 'దురాచారశమనీ' నామానికి అర్థం ఏమి?

జ. దురాచారాన్ని తొలగించే తల్లి అని అర్థం.

172. "దోషవర్జితా"నామానికి  అర్థం ఏమి?

జ. ఎటువంటి దోషాలు లేని తల్లి, మరియు అన్నీ దోషాలు తొలగించే తల్లి అని అర్థం.

173. "సర్వజ్ఞా " అను నామానికి అర్థం ఏమి?

జ. దేశ, కాల పరిస్థితులు తెలిసి ఉన్న పరతత్త్వానికి సర్వజ్ఞా అని పేరు.

174. అమ్మకు ఉన్న ప్రధాన లక్షణాలు ఎన్ని? అవి ఏవి?

జ. అమ్మకు ఉన్న ప్రధాన లక్షణాలు ఆరు. అవి :1). సర్వజ్ఞత 2). స్వతంత్రత 3). అనాదిబోధ 4). నిత్యత 5). సంపూర్ణత మరియు 6). అనంతత.

175. సాంద్రకరుణ అనగానేమి?

జ. చిక్కనైన, పుష్కలమైన మరియు పరిపూర్ణంగా ఉన్న కరుణను సాంద్రకరుణ అంటారు.

176."సమానాధికవర్జితా" నామానికి అర్థమేమి?

జ. సమానమైనది, సాటియైనది మరియు అధికమైనది ఏదీలేని తల్లి.

177. నవావరణవిద్యలోగల నామాలు ఎన్ని? అవి ఏవి?

జ. నవావరణవిద్యలోగల నామాలు తొమ్మిది. అవి నిస్తులా, నీలచికురా, నిరపాయా, నిరత్యయా, దుర్లభ, దుర్గమ, సర్వజ్ఞా, సాంద్రకరుణా, మరియు సమానాధికవర్జితా.

178. నవావరణ విద్య యొక్క ఫలం చెప్పే నామాలు ఎన్ని? అవిఏవి?

జ. నవావరణ విద్య యొక్క ఫలం చెప్పే నామాలు మూడు. అవి: దుఃఖహంత్రీ, సుఖప్రదా మరియు దురాచారశమనీ.

## సర్వమంత్రస్వరూపిణి

179. 'సర్వ' అనే శబ్దము దేనిని సూచిస్తుంది?

జ. 'సర్వ' అనే శబ్దము పరబ్రహ్మమునకు సూచిస్తుంది.

180. 'సర్వమంగళ' అనే నామానికి అర్థం ఏమిటి?

జ. సృష్టిలో మనం దేని నుండి మంగళములు పొందుతున్నామో అవన్నీ అమ్మ రూపములే, అందుకే అమ్మ “సర్వమంగళ”.

181. 'సుమంగళి' అని దేనికి పేరు?

జ. సూర్యుడు ఉదయించినపుడు పసుపు ఎరుపు ఛాయ కలిసిన ఉషః కాలానికి ,కాంతికి సుమంగళి అని పేరు.

182. శాస్త్రంలో చెప్పబడిన కొన్ని మంగళవస్తువులను పేర్కొనండి?

జ. 1). వేదవేత్త 2). గోవు 3). అగ్ని 4). సువర్ణము 5). నెయ్యి 6). సూర్యుడు 7). పుణ్యస్త్రీ 8). రాజు 9). తులసి 10). బిల్వము 11). పుష్పము 12). అద్దము 13). శివలింగము 14).సాలగ్రామము.

183. 'సద్గతిప్రదా' అనే నామానికి అర్థం?

జ. ఉన్న స్థితి కంటే ఉన్నత స్థితిని ఇస్తుంది  అని అర్థం .

184. సద్గతులు ఎన్ని రకాలు?

జ. సద్గతులు రెండు రకములు. అవి - 1). సాపేక్ష సద్గతి 2). నిరపేక్ష సద్గతి.

185. సాపేక్ష సద్గతి అనగానేమి?

జ. అమ్మవారిని పూజింపగా పూజింపగా ఉత్తమ లోకాలు సంప్రాప్తిస్తాయి. అటు పైన ఉత్తమ జన్మలు లభించి సాధన చేసి తరించవచ్చు.

186. మనిషి జన్మ రావడానికి ముందు ఉండే క్రమం ఏమిటి?

జ. మనిషి జన్మకు ముందు శిలా, లతా, పొదలు, ఓషధులు, వనస్పతులు, క్రిమికీటకాలు, జలచరాలు, మృగాలు, పశువులు, పక్షులు ఆపైన వచ్చేది మానవ జన్మ.

187. గతులు ఎన్ని రకాలు?

జ. 1). పాపగతులు 2). పుణ్యగతులు 3). మిశ్రమం (అయితే మానవ జన్మ పొందుతారు).

188. పుణ్యాత్ములు ఏ గతులు ద్వారా వెళ్తారు?

జ. సకామంగా ఇష్టాపూర్తాది కర్మలు చేయువారు అంటే పది మందికి పనికి వచ్చే కర్మలు చేయువారు ధూమ మార్గము ద్వారా పుణ్యలోకాలకు వెళ్తారు. ఆ పుణ్యం తీరిపోగానే మర్త్య లోకం లోకి వస్తారు. ఉపాసకులు, భక్తులు జ్యోతిర్మయి మార్గము (అర్చిరాది మార్గం )ద్వారా దేవతా లోకము చేరతారు. అక్కడ నుంచి క్రమ ముక్తి పొందుతారు.

189. పరామార్గము అంటే ఏమిటి?

జ. జీవన్ముక్తి.

190. 'సర్వేశ్వరీ' నామానికి అర్థం?

జ. నియామకురాలు.

191. 'సర్వమయీ' నామానికి అర్థం?

జ. సర్వమూ ఆ తల్లే. కనిపించే జగత్తు మొదలుకుని కనిపించని లోకాలు సైతం ఆ తల్లే.

192. 'మయం' అని ఎప్పుడు అనాలి?

జ. ఉపాధి కనిపిస్తూ ఉండగా పరతత్వాన్ని చెప్పవలసి వస్తే , 'మయం' అని చెప్పాలి. ఉదా: బంగారు ఉంగరం. కనిపించడానికి ఒక ఆకారం ఉన్నా అందులో ఉన్నదంతా బంగారమే కదా.

193. 'సర్వమంత్రస్వరూపిణి' అనే నామానికి అర్థం?

జ. ఈ నామానికి రెండు అర్థాలు ఉన్నవి. 1 ). శ్రీవిద్య కి సర్వమంత్రము అని పేరు. 2 ). ఏ మంత్రము తీసుకున్నా అది ఆ తల్లే. ఎందుకంటే మంత్రములో ఉండేది వర్ణము, శబ్దము. వర్ణము తల్లి రూపము, అలాగే మంత్ర చైతన్యము కూడా తల్లి రూపమే.

194. 'సర్వయంత్రాత్మిక' అనే నామానికి అర్థం?

జ. శ్రీచక్రము.

195. 'సర్వతంత్రరూప' అనే నామానికి అర్థం?

జ. శ్రీవిద్య.

196. “సర్వమంత్రస్వరూపిణి / సర్వయంత్రాత్మిక / సర్వతంత్రరూప”, మూడు నామాలను కూర్చడంలో విశేషం ఏమిటి?

జ. మంత్రము, యంత్రము, తంత్రము అంటే బిందురూపిణి అయిన ఆ తల్లి శబ్దశక్తి మంత్రము. ఆ శబ్దశక్తిని పట్టి చూపించింది యంత్రము. ఆ యంత్ర రూప దేవతను ఎలా పూజించాలో చెప్పే విధానము తంత్రము. అంటే ఇక్కడ మొత్తం ఉపాసనా స్వరూపాన్ని చూపిస్తున్నారు.

197. తంత్రము అంటే ఏమిటి?

జ. దేవత ఉపాసనా విధానమే తంత్రము.

198. తంత్రము ఎన్ని రకాలు?

జ. తంత్రము రెండు రకాలు. అవి - 1). వేదసమ్మతం 2). వేదవిరుద్ధం.

## త్రిపురా వైభవం

199. " మనోన్మనీ" నామం ఏ మాలా మంత్ర విశేషము?

జ. 'మనోన్మనీ' నామం “వన దుర్గా మాలా“ మంత్ర విశేషము.

200. దక్షిణాచారం అంటే ఏమిటి?

జ. బ్రహ్మ విద్యా భావంతో చేసే ఉపాసనని దక్షిణాచారం అంటారు.

201. వామాచారం అంటే ఏమిటి?

జ. అభీష్ట, అభిచారిక భావంతో చేసే ఉపాసనని వామాచారం అంటారు.

202. మనోన్మనీ నామాన్ని, అయ్యవారి పరంగా ఎలా పలుకుతారు?

జ. 'మనోన్మనః'.

203. 'మనోన్మనః' నామం ఏ వేద మంత్రములో వున్నది?

జ. రుద్ర సూక్తం.

204. త్రిపుటికి ఉదాహరణలు ఇవ్వండి.

జ. 1). ధ్యాన, ధ్యేయ, ధ్యాతృ, 2). జ్ఞాన, జ్ఞేయ, జ్ఞాత.

205. మనోన్మనీ అర్థం ఏమిటి?

జ. త్రిపుటి లేదు, ఉన్నది ఒక్కటే, ఏకత్వం అని తెలిపే జీవబ్రహ్మై కృత్వం.

206. త్రిపుర సుందరి సంకేత అర్థం ఏమిటి?

జ. త్రిపుటి ఏకం అయినప్పుడు కలిగే ఆనందమే “త్రిపురసుందరి”.

207. త్రిపురాసుర సంహారం సంకేత అర్థం ఏమిటి?

జ. త్రిపుటి నశించుటయే త్రిపురాసుర సంహారం.

208. త్రివిక్రమ నామ సంకేత అర్థం ఏమిటి?

జ. త్రిపుటి యందు వ్యాపించినది ఒక్కటే అని తెలిపే నామం.

209. మనోన్మనీ స్థితి యందు యోగి ఎలా ఉంటాడు?

జ. "అంతర్లక్ష్యం  బహిర్దృష్టి"తో ఉంటాడు .

210. శ్రీచక్ర పరంగా మనోన్మనీ స్థానం ఎక్కడ?

జ. సహస్రారంలో బిందువుని చేరబోయే ముందర స్థానం.

211. యోగ పరంగా మనోన్మనీ స్థానం ఎక్కడ?

జ. భ్రూమధ్యం నుంచి ఎనిమిదవ స్థానం.



212. ప్రకృతికి మరో పేరు ఏమిటి?

జ. మాయ.

213. మాయ ఎవరి ఆధీనంలో ఉన్నది?

జ. మహేశ్వరుని ఆధీనంలో ఉన్నది.

214. మహేశ్వర తత్వం తెలిపే వన దుర్గా మాలా మంత్ర నామం ఏమిటి?

జ. మహేశ్వరీ.

215. మహేశ్వరీ నామానికి అర్థం ఏమిటి?

జ. 'ప్రకృతిని తన ఆధీనంలో ఉంచుకున్నది' అని అర్థం.

216. మహాదేవుని శక్తిని తెలిపే నామం ఏది?

జ. మహాదేవీ.

217. 'మహా' శబ్దం, 'సర్వ' శబ్దం దేనికి సూచకంగా వాడుతారు?

జ. పరబ్రహ్మ కు.

218. అష్టమూర్తులలో చంద్రుణ్ణి చెప్పే నామం ఏది?

జ. 'మహాదేవ'.

219. సహస్రార అంతర్గతమైన చంద్ర స్వరూపం అయ్యవారు అయితే, అమ్మవారి స్వరూపం ఏమిటి?

జ. రోహిణి.

220. దేవతలకే దేవి అని తెలిపే నామం ఏమిటి?

జ. 'మహాదేవీ'.

221. 'మహాదేవి' ఉన్న తీర్థం ఏ నదీ తీరాన ఉన్నది?

జ. గండకీ నదీ తీరాన ఉన్నది.

222. లక్షించేది మరియు లక్షింపబడేది అని తెలిపే నామం ఏమిటి?

జ. మహాలక్ష్మి.

223. కొల్హాపురి క్షేత్రంలో ఉన్న ఆద్యాలక్ష్మి ఎవరు?

జ. మహాలక్ష్మి.

224. విశాఖపట్నం భీమిలి యందు మహాలక్ష్మిని ఎవరు ప్రతిష్ఠ చేశారు?

జ. శ్రీ సద్గురు శివానందమూర్తి గారు.

## మహామాలా నామాలు మొదటి భాగం

225. లలితా సహస్రనామాలలో, మంత్రవిద్య ఉందనడానికి ప్రమాణం ఏమిటి?

జ. లలితా సహస్రనామాలలో కొన్నిచోట్ల బీజాక్షరాలు స్పష్టంగా గోచరమవుతాయి. అలా గోచరం కానప్పుడు, పరంపరలో ఉపాసనా సాధకులు సిద్ధి పొంది, ఫలానా నామంలో ఫలానా మంత్రములు ఉన్నాయని చూపించినది ప్రమాణంగా స్వీకరించాలి.

226. అమ్మ అనేక రూపములు ఎందుకు ధరించింది?

జ. అమ్మ తాను తన ఇచ్ఛతో భక్తులను అనుగ్రహించడం కోసం దివ్య నామములు, దివ్య విగ్రహ రూపములు ధరించింది. ఆ స్వరూపానికి, బ్రహ్మ తత్వానికి భేదం లేదు. అమ్మ రూపము 'మహారూపం'. అమ్మ తత్వం “మహా తత్వం”.

227. ”మహా”శబ్దం వేటికి వాడాలి?

జ. “మహా”అనే శబ్దాన్ని: 1). పురుషుడు 2). ప్రధానం 3). వ్యక్తం 4). కాలం అనే వాటికి వాడాలి. గొప్ప, పెద్ద, పరబ్రహ్మ అన్న అర్థంలో కూడా “మహా” శబ్దం వాడాలి.

228. “పురుషుడు" అనే శబ్దం ఎవరెవరికి వాడతారు?

జ. పురుషుడు అనగా జీవుడు, సృష్టి కర్త, బ్రహ్మ, పరమపురుషుడు.

229. "ప్రధానం" అనగా ఏమిటి?

జ. ప్రధానం అనగా “అవ్యక్తం”అయిన ప్రకృతి, దాని నుంచి వచ్చిన “వ్యక్తమైన”ప్రకృతి.

230. మహారూపా అనే నామంలో "మహా" శబ్ద ప్రయోగ విశేషం ఏమిటి?

జ. అమ్మ రూపములు కేవలం ప్రకృతితో కూడిన రూపములు కాదు. ప్రకృతికి అతీతమైనవి అని చెప్పడం కోసం మహా శబ్దాన్ని ప్రయోగించారు.

231. మహిషాసుర సంహారం కోసం ఉద్భవించినప్పుడు అమ్మ రూపం వర్ణించండి?

జ. దేవతల ప్రార్థనలు విని అమ్మ మహిషాసుర సంహారం కోసం ఉద్భవించినప్పుడు అమ్మ నుండి వచ్చే తేజస్సు మూడులోకాలూ వ్యాపించిందని, అమ్మ కిరీటం ఆకాశాన్ని రాసుకుంటున్నదని, అమ్మ పాదాల బరువుకు పాతాళ లోకాలు క్షోభ పడుతున్నాయని మరియు వేలకొలది చేతులతో దిక్కులన్నీ వ్యాపించి ఉన్నది అని సప్తశతిలోని శ్లోకం వర్ణిస్తున్నది.

232. "మహాపూజ్యా" నామ అర్థం ఏమిటి?

జ. 'మహాపూజ్యా' నామ అర్థం గొప్పవారిచేత గొప్పగా పూజింపబడే పరతత్వం ఆ పరమేశ్వరి. మనందరికీ వందనీయులైన దేవతల చేత, ఋషుల చేత ఆరాధింపబడేది. కాబట్టి మహాపూజ్య.

233. మహాపాతకనాశినిగా అమ్మవారు భక్తులను ఎలా ఉద్ధరిస్తారు?

జ. ప్రాయశ్చిత్త కర్మలు పాపాలను తీసేస్తాయి కానీ వాటికి కారణమైన సంస్కారములను తీసేయవు. పాప సంస్కారములతో సహా భక్తుల పాపాలను తీసేసి అమ్మవారు భక్తులను ఉద్ధరిస్తారు.

234. 'మహాపాతకనాశినీ' అనే నామానికి మరొక ఆంతర్యం ఏమిటి?

జ. ప్రాయశ్చిత్త విధులలో రకరకాల దేవతలను పూజిస్తాం, ఆ దేవతల సమిష్టి రూపం అమ్మవారు. సమిష్టి రూపంలో ఉన్న అమ్మవారిని ఆరాధిస్తే ప్రాయశ్చిత్త విధులలో రకరకాల దేవతలను కూడా ఉపాసంచినట్లే.

235. మాయ అంటే ఏమిటి?

జ. మాయ పరమేశ్వరుడి శక్తి విశేషం. పిపీలికాది బ్రహ్మ పర్యంతం ప్రపంచమంతట నిండి ఉన్న పరమాత్మని గోచరం కానీయకుండా అడ్డుకునే అవిద్యయే మాయ.

236. పరమేశ్వరుడిని మనం ఎందుకు తెలుసుకోలేక పోతున్నాం?

జ. పరమేశ్వరుడి మాయా శక్తి వలననే ఆయనను మనం తెలుసుకోలేకపోతున్నాం.

237. పరమేశ్వరుడిని మనం ఎలా తెలుసుకోగలం?

జ. పరమేశ్వరుడిని తెలుసుకోవాలంటే ఆయన కృప వలననే తెలుసుకోగలం.

238. పరమేశ్వరుడిని మనం తెలుసుకోకుండా అడ్డుపడే మాయా శక్తి పేరేమిటి?

జ. పరమేశ్వరుడిని తెలుసుకోలేక పోతున్నప్పుడు ఆయన మాయా శక్తిని అవిద్య అంటున్నాం.

239. పరమేశ్వరుడిని తెలుసుకోగలిగినప్పుడు ఆయన శక్తిని ఏమంటారు?

జ. పరమేశ్వరుడిని తెలుసుకోగలిగినప్పుడు ఆయన శక్తిని విద్య అంటారు.

240. మహామాయా అనే నామానికి మరొక నిర్వచనం ఏమిటి?

జ. మహామాయా అంటే పరమాత్మ సృష్టి, స్థితి, లయలుగా చేసే విచిత్ర కార్యకరీ శక్తి.

241. జ్ఞాని మాయలో పడగలడా?

జ. అపరోక్ష జ్ఞానం పొందినవారికి మాయ లేదుకానీ, పరోక్ష జ్ఞానం పొందినవారికి మాయ ఉంటుంది. పరోక్ష జ్ఞానం వచ్చినప్పటికీ మాయ అనేక కర్మల రూపంలో పక్కన పొంచి ఉంటుంది.

242. పరోక్ష జ్ఞానం అంటే ఏమిటి?

జ. శాస్త్రములన్నీ చదివి పరబ్రహ్మమనగా ఏమిటి, లోకమంటే ఏమిటి, మిథ్య అంటే ఏమిటి, సత్యం అంటే ఏమిటి అని తెలుసుకోవడాన్ని పరోక్ష జ్ఞానం అంటారు. ఇది శాస్త్ర జన్య జ్ఞానం.

243. గర్భోపనిషత్తు సారాంశం ఏమిటి?

జ. గర్భంలో శిశువుకి సప్తమ మాసంలో, ఎన్నో జన్మల తర్వాత ఈ జఠరంలో పడ్డాను, ఈ దేహాదులు నేను కాను అనే జ్ఞానం కలుగుతుంది. అలా కలిగాక, ఈ జన్మలోనయినా మాయలో పడకుండా జాగ్రత్త చేసుకుంటాను అని ఒట్టు పెడతాడు. ఇంత జ్ఞానం కలిగినా, నవమ మాసం తర్వాత బయట పడగానే ఆ జ్ఞానం నశిస్తుంది. మళ్ళీ ఈ దేహమే నేననుకుంటాడు, ఒట్టు మరచిపోతాడు. ఇది గర్భోపనిషత్తు సారాంశం.

244. మాయ యొక్క ప్రాధాన్యత ఏమిటి?

జ. ప్రపంచం నడవాలంటే మాయ ఉండటం చాలా అవసరం. తల్లి బిడ్డను సాకేది మాయామయమైన మమకారం వలననే.

245. మరి మాయనుంచి ఎప్పుడు బయట పడాలో తెలిసేదెలా?

జ. మాయనుంచి ఎప్పుడు బయట పడాలో తెలియడం అసాధ్యం. కానీ, మనల్ని ఎప్పుడు మాయలో ముంచాలో, ఎప్పుడు బయటకి లాగాలో అమ్మవారికి తెలుసని అమ్మని ఆశ్రయిస్తే, ఆ తల్లే మనల్ని అనుగ్రహిస్తుంది.

246. మాయని అర్థం చేసుకోవడం ఎలా?

జ. మాయ ఎన్ని ఉపమానాలు ఇచ్చినా అర్థం కాదు. అమ్మవారిని ఆశ్రయిస్తే మనని ఎలా అనుగ్రహించాలో ఆవిడ చూసుకుంటుంది. ఇదే సప్తశతిలో సారాంశం కూడా.

247. గీతలో భగవానుడు తెలిపిన మాయా తత్వం ఏమిటి?

జ. దైవీయేషా గుణమయి మమ మాయా దురత్యయా

మామేవయే ప్రపద్యంతే మాయామేతాంతరంతితే।।

గుణమయమైన నా మాయను దాటడం చాలా కష్టం. దాటలేని ఆ మాయని నన్నాశ్రయించినవాడు దాటగలడు. ఇది గీతలో భగవానుడు తెలిపిన మాయా తత్త్వం.

248. మహాసత్వ, మహాశక్తి, మహారతి, మహాభోగా, మహైశ్వర్యా, మహావీర్యా, మహాబలా, మహాబుద్ధి, మహాసిద్ధి నామాలలో మనం గమనించవలసిన ముఖ్య అంశం ఏమిటి?

జ. మహాసత్వ, మహాశక్తి, మహారతి, మహాభోగా, మహైశ్వర్యా, మహావీర్యా, మహాబలా, మహాబుద్ధి, మహాసిద్ధి నామాలలో మనం గ్రహించవలసింది అమ్మవారి సమూహ శక్తి.

249. మానవులకు కావలసిన సత్వ శక్తికి మూలం ఏది?

జ. మానవులకు కావలసిన సత్వ శక్తికి మూలం అమ్మ.

250. మన సత్వ శక్తి క్షీణిస్తే తిరిగి పొందడం ఎలా?

జ. మన కడవలో నీరు అయిపోతే, నదినించి తెచ్చుకుంటాం. అలాగే అన్నింటికీ మూలమైన అమ్మని ఆశ్రయిస్తే మనకి కావలసిన సత్వ శక్తి తిరిగి నింపుతుంది.

251. సత్వం అనే పదానికి అర్థం ఏమిటి?

జ. సత్వం అంటే ప్రాణం, బలం, ఉనికి. అమ్మ గొప్ప ప్రాణ శక్తి, గొప్ప బలం, గొప్ప ఉనికి ఉన్నది.

252. శక్తి అంటే ఏమిటి?

జ. బలంతోబాటు పని చేయగల సమర్థత ఉంటే దానిని శక్తి అంటారు.

253. అమ్మకి మహాశక్తి నామం ఎందుకు సార్థకం?

జ. అమ్మ శక్తిని ఇంక యే శక్తితోనూ పోల్చలేము. అమ్మ శక్తికి సమానమైనదీ, అధికమైనదీ లేదు. అందుకే అమ్మ మహాశక్తి, పరబ్రహ్మ శక్తి.

254. రతి అంటే ఏమిటి?

జ. రతి అంటే ఆసక్తి, ప్రీతి. ఆనందించే లక్షణం.

255. అమ్మవారి ప్రస్తావనలో మహారతికి, సామాన్య మానవుల ప్రస్తావనలో రతికి తేడా ఏమిటి?

జ. కేవలం శివునియందు అత్యంత ఆసక్తి కలది అమ్మవారు. ఆయన మహాశ్శబ్దవాచి అయిన పరబ్రహ్మ కాబట్టి ఆ పరబ్రహ్మయందే అమ్మకు మహారతి. కానీ, సామాన్య మానవులలో, ఒక్కొక్క మనిషికి ఒక్కొక్క విషయమందు ఆనందించే లక్షణం ఉంటుంది. సంగీతం, సాహిత్యం, లౌకిక విషయాలు మొదలైన వాటిమీద, వారి కర్మ వాసనలనుబట్టి ఉత్తమ విషయాలు లేక అనుత్తమ విషయాలపై ఆనందించే లక్షణం ఏర్పడుతుంది.

256. శంకర వాఙ్మయము, ఇతర స్తోత్రాలలో మహారతి నామ అర్థాన్ని స్ఫురింపజేసే ఉదాహరణలు ఏమున్నాయి?

జ. "విపంచ్యా గాయంతీ వివిధమపదానం పశుపతే..." అనే సౌందర్యలహరి శ్లోకంలో వివరించారు శంకరులు. శారదాదేవి అమ్మ పక్కన సంగీతం పాడినా, శివుడిమీద పాటపాడితేనే ఇష్టం. శంకరులు సౌందర్యలహరి శివ అని మొదలుపెట్టారు. లలితాఅష్టోత్తర శత నామాలలో 'నిజభర్తృముఖాంభోజచింతనాయై నమః' అనే నామం ఉంది. తన భర్త ముఖారవిందాన్ని సదా ధ్యానిస్తూ ఉంటుంది అమ్మ!

257. మహారతికి మరొక విశేషమైన అర్థం ఏమిటి?

జ. మహారతికి మరొక విశేషమైన అర్థం మహాత్ముల ఆసక్తి తనయందు కేంద్రీకరించుకునే తల్లి.

258. భోగము అనే పదం ఎటువంటి అనుభవాన్ని వివరించడానికి వాడతాము?

జ. భోగము అనగా అనుభవం. ధనాన్ని, సుఖాన్ని అనుభవించేప్పుడే భోగము అనే పదం వాడతాము.

259. అమ్మవారి మహాభోగములను వర్ణించండి.

జ. అమ్మ గొప్ప భోగము కలది. మణిద్వీపంలో ఒక ఆవరణ మొత్తం అమ్మవారి అలంకారం చేసేవారు అనంగకుసుమ, అనంగమేఖల మొదలైనవారు ఉంటారు. అమ్మవారి అలంకారం చేసేవారికి పరిచారికలకి ఒక్కొక్కరి కింద మరలా లక్షమంది ఉంటారు. అలంకారానికి కావలసిన సామగ్రి ఏర్పాటు చేసుకోవటం వీరి ప్రధాన కర్తవ్యం. ఆ భూషణ మండపములో విరాజమాన అయిన అమ్మవారిని వీరు ఆపాదమస్తకము అలంకారం చేస్తారు. పక్కన వింజామరలు వీచేవారు, చామరములు పట్టేవారు, ఛత్రం పట్టేవారు, ఇంకా ఇలా అనేక భోగాలు అమ్మవారికి.

260. మనకు ప్రాప్తమైన భోగాలు మనం ఏ దృష్టితో స్వీకరించాలి / అనుభవించాలి?

Copyright@gurujnanam.org

జ. మనకు ప్రాప్తమైన వాహనం, ఇల్లు, వస్త్రం మొదలైనవన్నీ కూడా మన పుణ్యకర్మల ఫలంగా అమ్మ అనుగ్రహంవలన ప్రసాదంగా లభించేవే అనే దృష్టితో స్వీకరించాలి / అనుభవించాలి.

261. ఐశ్వర్య శబ్దానికి అర్థం ఏమిటి?

జ. ఐశ్వర్య శబ్దానికి రెండు అర్థాలున్నాయి. ఒకటి విభూతులు, రెండవది ఈశ్వరత్వము. ఈశ్వరత్వము అంటే అధికారం.

262. 'మహైశ్వర్యా' నామానికి ఉన్న అర్థం ఏమిటి?

జ. 'మహైశ్వర్యా' అంటే గొప్ప ఐశ్వర్యములు కలది అని అర్థం. మహైశ్వర్యం అంటే గొప్ప అధికారం కలది అని కూడా అర్థం.

263. మానవులకు ఐశ్వర్యములు ఎలా కలుగుతాయి?

జ. అమ్మ అనుగ్రహంవలననే మానవులకు అష్ట ఐశ్వర్యములు, ఇష్ట సంపదలు కలుగుతాయి.

264. అష్ట ఐశ్వర్యములు అంటే ఏమిటి?

జ. అష్ట ఐశ్వర్యములు అంటే, దాసులు (పనులు చేసిపెట్టేవారు), భృత్యులు (డబ్బుకు పనులు చేసిపెట్టేవారు), సుతులు, బంధువులు, వస్తువులు, వాహనాలు, ధనములు, ధాన్యాలు.

265. మహానుభావులు తమకు కలిగిన ఐశ్వర్యానికి ఎందుకు చలించరు?

జ. ఇహపర ఐశ్వర్యాలన్నీ కూడా కర్మపరిమిత కాలభోజ్యాలు. అంటే, సత్కర్మవలన కలిగిన ఐశ్వర్యం ఆ కర్మవేగం ఉన్నంతవరకు మాత్రమే నిలుస్తుంది. అందుకే మహానుభావులు తమకు కలిగిన ఐశ్వర్యానికి చలించరు. మిడిసిపడరు.

266. నిజమైన ఐశ్వర్యము అంటే ఏమిటి? అది ఎవరు ప్రసాదించగలరు?

జ. ఎప్పటికీ తరగని ఐశ్వర్యము అంటే మోక్షం, పరబ్రహ్మ ప్రాప్తి. అమ్మ పాదాలు లభిస్తే అదే మహైశ్వర్యము. ఆ మోక్ష సుఖం అమ్మవారే ఇవ్వగలరు.

267. 'మహావీర్యా' అనే నామ అంతరార్థం ఏమిటి?

జ. వీర్యము అంటే ఉత్పత్తి కారణమైన శక్తి. ఈ అనంత భువనాలను త్రికాలాలలో సృష్టిస్తున్నది అమ్మవారు. మహద్యోని అనగా ప్రకృతి. అందులో ఈశ్వర శక్తి ప్రవేశించి ఈ జగత్తు అంతా నిర్మాణమవుతుంది. జగన్నిర్మాణం చెయ్యగల ఉత్పత్తి సంపద ఉన్నది కనుక మహావీర్యా.

268. శ్రీచక్రం ఆధారంగా మహాబలా నామానికి అర్థం ఎలా గ్రహించవచ్చు?

జ. బలం అనే మాటకి చాలా అర్థాలున్నాయి. బలం అనే మాటకి సైన్యం అనే అర్థం కూడా ఉంది.

అమ్మవారు 'భండాసురవధోద్యుక్తశక్తిసేనాసమన్వితా' లెక్క లేనన్ని సైన్యాలు ఉన్నాయి ఆవిడ దగ్గర. శ్రీచక్రం నిండా సైన్యమే! మధ్యలో బిందువులో అమ్మవారు కూర్చుంటారు. అందుకే ఆవిడ మహాబలా.

269. దైనందిన జీవితంలో అమ్మవారు మహాబుద్ధిగా మనకి ఎలా గోచరిస్తారు?

జ. యాదేవీ సర్వ భూతేషు బుద్ధిరూపేణ సంస్థితా! ప్రపంచంలో ప్రతివాడి బుద్ధి శక్తి అమ్మవారే! విశ్వ శిల్పి అమ్మవారు. విశ్వానికి మూలం అమ్మ. సూర్య చంద్రోదయాలు, విత్తనంనుంచి కలిగే మహావృక్షం, సూర్యకాంతి సోకిన మొగ్గ పువ్వుగా మారడం, ఆ పూలలో కనీవినీ ఎరుగని వర్ణములు, చేదైన చెట్టుకి తీయని పండు, కంటికి చూపు, ఇటువంటి అద్భుతమైన ప్రపంచం రచించిన ఈశ్వర జ్ఞానం మహాబుద్ధి.

## మహా సిద్ధయే మహా త్రిపుర సుందరి

270. శ్రీ చక్రంలో ప్రథమావరణ పేరు ఏమిటి?

జ. శ్రీ చక్రంలో ప్రథమావరణ త్రైలోక్య మోహన చక్రము.

271. శ్రీ చక్రంలో అంతఃపురము ఏమిటి?

జ. శ్రీ చక్రంలో అంతఃపురము బిందువు.

272. అష్టసిద్ధులు ఏమిటి?

జ. అష్టసిద్ధులు అనగా - అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశిత్వం, వశిత్వం.

273. రసోల్లాసం అంటే ఏమిటి?

జ. రసోల్లాసం అంటే జప, స్తోత్ర భావాన్ని ఆస్వాదించుట.

274. ద్వంద్వైరనిభూతం అంటే ఏమిటి?

జ. ద్వంద్వైరనిభూతం అంటే సుఖ దుఃఖాలు, లాభ నష్టాలూ కలుగుతున్నా చలించకుండా ఉండుట.

275. అధమోత్తమ అభావః అంటే ఏమిటి?

జ. అధమోత్తమ అభావః అంటే ఇది గొప్పది, ఇది చెత్తది అనే భావన పోవుట.

276. కాంతి, బల, విశోకము అంటే ఏమిటి?

జ. కాంతి - శరీరములో ఒక తెలియని కాంతి వచ్చుట; బల - బలము వచ్చుట, విశోకము - ఒక శోకము లేని స్థితి ఏర్పడుట.

277. తపోధ్యానాదినిష్ఠ అంటే ఏమిటి?

జ. తపోధ్యానాదినిష్ఠ అంటే తపస్సు చేసేటప్పుడు గానీ, ధ్యానం చేసేటప్పుడు గానీ చెక్కు చెదరకుండా కూర్చోగలుగుట.

278. కామ చారిత్వము అంటే ఏమిటి?

జ. ఏ అడ్డంకులు లేకుండా సాధనకోసము ఎక్కడికైనా తిరగగలుగుట.

279. యత్రక్వచనసాయితే అంటే ఏమిటి?

జ. యత్రక్వచనసాయితే అంటే ఎక్కడైనా ఉండి సాధన చేసుకోగలగడం.

280. “మహాయోగము”అంటే ఏమిటి?

జ. “మహాయోగము”అంటే అమ్మ పాదాలు, పరతత్వ ప్రాప్తి లభించటం.

281. మహాయోగము పొందిన వారిని ఏమంటారు?

జ. మహాయోగము పొందిన వారిని మహాయోగీశ్వరులు అంటారు.

282. బీజ అధిదేవతల పేర్లు ఏమిటి?

జ. పద్నాలుగు బీజ అధిదేవతల పేర్లు: వాయువు, ఆత్మ, సత్యదేవుడు, సర్వం, పురః, అంతః, యజ్ఞః వషట్కారః, ఇంద్ర, రుద్ర, విష్ణు, బ్రహ్మ, నమః, ప్రజాపతి.

283. మహాతంత్రా నుండి యోగినీగణసేవితా వరకు ఉన్న 13 నామములలో ఏ విద్య తెలియ చేయ బడినది?

జ. మహాతంత్రా నుండి యోగినీగణసేవితా వరకు ఉన్న 13 నామములలో “మహాయాగక్రమ విద్య” తెలియ చేయబడినది.

284. శ్రీ విద్యలో కొన్ని పారిభాషిక పదములు ఏమిటి?

జ. శ్రీ విద్యలో కొన్ని పారిభాషిక పదములు: మహాయాగం, రహోయాగం, అంతర్యాగం, బహిర్యాగం.

285. మహాయాగం ఎవరు చేసారు?

జ. మహాయాగం పరమేశ్వరుడిచే చేయబడినది.

286. అంతర్యాగం అంటే ఏమిటి?

జ. మన అహాన్ని ఆహుతి చేసుకోవటమే అంతర్యాగం.

287. బహిర్యాగము అంటే ఏమిటి?

జ. శ్రీచక్ర ఆరాధన బహిర్యాగము.

288. మహాయాగం అంటే ఏమిటి?

జ. అంతర్యాగం, బహిర్యాగం కలిపి చేస్తే మహా యాగం.



289. మహాతంత్రము అంటే ఏమిటి?

జ. మహాతంత్రము అంటే భుక్తి, ముక్తి ప్రదాయకమైన మోక్ష కారకమైన తంత్రము, శ్రీవిద్యయే మహా తంత్రము.

290. మహాయంత్రము అంటే ఏమిటి? ఎన్ని ప్రస్తారములుగా ఉన్నది?

జ. భూ ప్రస్తార, మేరు ప్రస్తార, కైలాస ప్రస్తారములతో ఉన్న శ్రీ చక్రమే మహా యంత్రము.

291. శ్రీ విద్యకు ఉన్న ఇతర పేర్లు ఏమిటి?

జ. శ్రీ విద్యకు ఉన్న ఇతర పేర్లు: యంత్రరాజము, సిద్ధవజ్రము.

292. అష్టభైరవుల పేర్లు ఏమిటి?

జ. అష్టభైరవులు: 1). అసితాంగభైరవ 2). ఋఋభైరవ 3). చండభైరవ 4). క్రోధభైరవ 5). ఉన్మత్తభైరవ 6). కపాలభైరవ 7). భీషణభైరవ 8). సంహారభైరవ

293. భైరవారాధనకి విశేష తిధి వారాలు ఏమిటి?

జ. భైరవారాధనకి అష్టమి, ఆదివారము విశేషము. మార్గశీర్ష శుద్ధ అష్టమి కాలం భైరవాష్టమిగా ప్రసిద్ధి.

294. భైరవ శబ్దానికి అర్ధం ఏమిటి?

జ. భైరవ శబ్దానికి అర్ధం: భరత్వ (పోషించుట), రమణత్వ (ఆనందింప చేయుట), వమనత్వాత్ (సృష్టిని వెలిగ్రక్కుట) భైరవః.

295. మహాకల్పము అంటే ఏమిటి?

జ. నాలుగు యుగాలు - ఒక మహా యుగము, డెబ్బైఒక్క మహా యుగములు - ఒక మన్వంతరము; పధ్నాలుగు మన్వంతరములు - ఒక కల్పము; నూరు కల్పములు - ఒక మహా కల్పము.

## చతుష్షష్ట్యుపచారాఢ్యా నామం నుండి చక్రరాజనికేతనా నామం వరకు

296. అమ్మవారికి ఉపచారములు ఎన్ని?

జ. అమ్మవారి ఉపచారాలు ఎన్నో ఉన్నాయి. అందులో ప్రధానమైనవి :1). పంచోపచారం 2). షోడశోపచారము 3). చతుష్షష్టి ఉపచారాములు (అరవై నాలుగు). అరవై నాలుగు ఉపచారాల అధికారం అమ్మవారికే ఉంది.

297. కర్పూర వీటిక ఉపచారం పొందిన తరువాత అమ్మవారి నవ్వుని ఎలా వర్ణించారు?

జ. కర్పూర వీటిక ఉపచారం పొందిన తరువాత అమ్మవారి నవ్వుని 'ఆనందోల్లాస విలాస హాస్యం'గా వర్ణించారు.

298. అమ్మవారికి అరవైనాలుగు ఉపచారాలు ఎందుకు చెప్పారు?

జ. శ్రీచక్రంలో బిందువు కాక, ఎనిమిది ఆవరణలు ఉన్నాయి. ఈ ఎనిమిది ఆవరణలలో ఒక్కొక్క శక్తిలో అరవైనాలుగు శక్తులు ప్రధానంగా ఉన్నాయి. కాబట్టి అరవైనాలుగు ఉపచారములు.

299. విద్యా కళలు ఎన్ని? వృత్తికళలు ఎన్ని?

జ. విద్యా కళలు అరవైనాలుగు, మరియు వృత్తికళలు అరవైనాలుగు.

300. అమ్మవారిని కొలుచుకొంటున్న యోగినీ గణాలు ఎన్ని?

జ. అమ్మవారిని కొలుచుకొంటున్న యోగినీ గణాలు అరవైనాలుగు కోట్లు. శ్రీచక్రంలో మొత్తం ఐదు వందల డెబ్బై ఆరు కోట్ల యోగినీ దేవతలుంటారు. ఇదే మహాయాగక్రమారాధ్యా.

301. త్రైలోక్య మోహన చక్రంలో ఉన్న ఎనిమిది మంది మాతృకాదేవతలు ఎవరు?

జ. త్రైలోక్య మోహన చక్రంలో ఉన్న ఎనిమిది మంది మాతృకాదేవతలు: 1). బ్రాహ్మి 2). మాహేశ్వరి 3). కౌమారి 4). వైష్ణవి 5). వారాహి 6). మాహేంద్రి 7). చాముండ 8). మహాలక్ష్మి.

302. మనువు అంటే అర్థం ఏమిటి?

జ. మనువు అంటే ఒక అర్థం మంత్రము. మంత్రరూపములన్నీ అమ్మ రూపములే.

303. ప్రపంచంసక్రమముగా నడవడానికి ఎవరెవరు పని చేస్తున్నారు?

జ. ప్రపంచం నడవడానికి ఇంద్రుడు, మనువులు, ప్రజాపతులు, శివుడు, విష్ణువు, సుబ్రహ్మణ్యుడు, బ్రహ్మ పని చేస్తారు.

304. ఇంద్రాది దేవతలు అంతా వారి పని వారు సమర్థవంతంగా చేయాలంటే ఏమి చేయాలి?

జ. ఇంద్రాది దేవతలు అంతా వారి పని వారు సమర్థవంతంగా చేయాలంటే శక్తిని ఉపాసించాలి.

305. దేవతలలో శ్రీవిద్యోపాసకులు ప్రధానంగా ఎంతమంది? వారు ఎవరు?

జ. దేవతలలో శ్రీవిద్యోపాసకులు ప్రధానంగా పన్నెండు మంది. వారు మనువు, చంద్రుడు, కుబేరుడు, అగస్త్యులు, లోపాముద్ర, మన్మథుడు, అగ్ని, ఇంద్రుడు, సూర్యుడు, దూర్వాసుడు, సుబ్రహ్మణ్యుడు, శివుడు.

306. శ్రీవిద్యోపాసన విధానాన్ని ఏమంటారు?

జ. శ్రీవిద్యోపాసన విధానాన్ని “కూటత్రయ విద్య”అంటారు. అవి వాగ్భవకూటం, కామరాజకూటం, శక్తి కూటం.

307. ఆర్యాద్విశతిని అందించిన వారు ఎవరు?

జ. ఆర్యాద్విశతిని అందించిన వారు దూర్వాసులు. వీరే కాంచీపురంలో అమ్మవారి పూజ విధానాన్ని పెట్టిన వారు, శివాంశ సంభూతులు.

308. అమ్మవారి ఆరాధనా విధానము ఎవరు చెప్పగలరు?

జ. అమ్మవారి ఆరాధనా విధానము శివ అంశ ఉన్నవారే చెప్పగలరు. ఉదాహరణ: దూర్వాస మహర్షి.

309. మానవులకు మొదటివాడు ఎవరు?

జ. మానవులకు మొదటివాడు స్వాయంభు మనువు.

310.చంద్రత్వం అంటే ఏమిటి?

జ. చంద్రత్వం అంటే చల్లదనం,  రసం, ఆర్ద్రత. అదే చంద్రవిద్య.

311. సోమపానం అంటే ఏమిటి?

జ. సోమలత నుండి పానం చేసేది సోమపానం. అది యజ్ఞములో ప్రక్రియ. అది బహిర్యాగం

312. లంబికా యోగము అనగా ఏమిటి?

జ. లంబికా యోగంలో సహస్రారకమలం నుండి స్రవిస్తున్న మధు ధారని నాలికతో అంగుటినుండి ఆస్వాదిస్తారు. ఇది యోగులు మాత్రమే చేయగలరు.

313. ఆదిశంకరుల పరమ గురువులు ఎవరు?

జ. ఆదిశంకరుల పరమ గురువులు గౌడ భగవత్పాదులు.

314. గౌడ భగవత్పాదులు అమ్మవారి మీద రచించిన గ్రంథము ఏమిటి?

జ. గౌడ భగవత్పాదులు అమ్మవారి మీద రచించిన గ్రంథము "సుభగోదయ స్తుతి". ఇది సౌందర్యలహరికి మాతృకాగ్రంథము.

315. చంద్రమండలమధ్యగా అంటే అర్థం ఏమిటి?

జ. చంద్రమండలం అనేది శ్రీచక్రానికి మరో పేరు. ఎలా అంటే, తొమ్మిది ఆవరణలు ఉన్న శ్రీచక్రంలో మూడు ఆవరణలు ఒక మండలంగా తీసుకుంటే, త్రైలోక్యమోహనచక్రం నుండి మూడేసి ఆవరణలుగా అగ్నిమండలం, సూర్యమండలం, చంద్రమండలం ఉన్నాయి. చంద్రమండలానికి మధ్యలో బిందురూపంలో అమ్మ ఉంది కనుక చంద్రమండలమధ్యగా. మన శరీరంలో ఉన్న ఆరు చక్రాలలో రెండేసి వాటిని మండలంగా చేస్తే, అగ్నిమండలం, సూర్యమండలం, చంద్రమండలం ఉన్నాయి. ఆజ్ఞా చక్రం నుండి సహస్రారం వరకు చంద్రమండలం. సహస్రారం మధ్యలో ఉన్న స్వరూపమే అమ్మవారు.

316. అగ్ని శిరస్సు అంటే ఏమిటి?

జ. అగ్ని శిరస్సు అంటే మూలాధారంలో మూడు చుట్లు చుట్టుకొని ఉన్న కుండలినీ మధ్యలో ఉన్న తేజస్సు. ఇదే "మహాలింగం".

317. చారురూపా అంటే ఏమిటి?

జ. చారురూపా అంటే,

1). ఆహ్లాదకరమైన రూపం, సుందరమైన రూపం.

2). దు:ఖ స్పర్శ లేని ఆనందము అని ఆదిశంకరాచార్యుల వారు త్రిశతి భాష్యంలో వివరించారు. అమ్మ కేవలం ఆనంద రూపిణి.

## నామ వైభవం

318. బ్రహ్మరంధ్రము వద్ద ఉన్న చక్రము ఏది?

జ. బ్రహ్మరంధ్రము వద్ద ఉన్న చక్రము సర్వానందమయ బిందు చక్రము.

319. మస్తకము వద్ద ఉన్న చక్రము ఏది?

జ. మస్తకము వద్ద ఉన్న చక్రము సర్వసిద్ధిమయ త్రికోణ చక్రం.

320. లలాటము వద్ద ఉన్న చక్రము ఏది?

జ. లలాటము వద్ద ఉన్న చక్రము సర్వరోగహర అష్ట త్రికోణ చక్రం (వశిన్యాది వాక్ దేవతలు ఉండేది ఇక్కడే).

321. భ్రూమధ్యము వద్ద ఉన్న చక్రము ఏది?

జ. భ్రూమధ్యము వద్ద ఉన్న చక్రము సర్వరక్షాకర అంతర్దశార చక్రము.

322. కంఠము వద్ద గల చక్రము ఏది?

జ. కంఠము వద్ద గల చక్రము సర్వార్ధసాధక బహిర్దశార చక్రము.

323. హృదయము వద్దగల చక్రము పేరు ఏది?

జ. హృదయము వద్దగల మన్వస్రం (పద్నాలుగు త్రికోణాల), సర్వసౌభాగ్యకర చక్రము.

324. నాభి వద్దగల చక్రము ఏది?

జ. నాభి వద్ద గల చక్రము అష్టదళముల సర్వసంక్షోభ చక్రము.

325. కటి, ఊరువుల దగ్గర ఉన్న చక్రము ఏది?

జ. కటి, ఊరువుల దగ్గరున్న చక్రము షోడశ దళముల సర్వాశాపరిపూరక చక్రము.

326. మూలాధారం నుంచి పాదముల వరకు విస్తరించి ఉన్న చక్రము ఏది?

జ. మూలాధారం నుంచి పాదముల వరకు విస్తరించి ఉన్న చతురస్రం, "త్రైలోక్య మోహన చక్రం".

327. శ్రీవిద్య యొక్క అసలు వైభవము ఏమిటి?

జ. శ్రీవిద్య యొక్క అసలు వైభవము బ్రహ్మ విద్య (అందువలనే ఆదిశంకరులు పట్టుకున్నారు).

328. "ఉమా హైమవతీ బహు శోభమానా" అని ఏ ఉపనిషత్తులో చెప్పబడినది?

జ. "ఉమా హైమావతీ బహు శోభమానా" అని కేనోపనిషత్తులో చెప్పబడింది.

329. "పార్వతి"నామ అర్ధము ఏమిటి?

జ. "పార్వతి"నామ అర్థం:

లీలార్ధం - 1). పర్వత రాజ పుత్రి పరమార్ధములు:

2). బ్రహ్మ విద్యా స్వరూపిణి - పరమేశ్వరుడు బ్రహ్మము అయితే పార్వతీదేవి బ్రహ్మవిద్య

3). కూటస్థం అచలం ధృవం - ఈ శరీరం అనే కూటములో కదలకుండా ఉండేది కూటస్థం, అదే ఆత్మ.

4). మూడు పర్వములుగా ఉన్న ఇచ్ఛ, జ్ఞాన, క్రియ శక్తులను కలిపి పార్వతి అన్నారు.

5). షట్చక్రాలు పర్వాలు. వాటిల్లో విస్తరించి వ్యాపించిన కుండలిని శక్తియే పార్వతి.

6). శ్రీచక్రంలో నవావరణలు ఉన్నాయి, ఈ నవావరణ పర్వములలో నివసించి ఉన్న "చక్ర రాజ నికేతన"శక్తియే పార్వతి (అందుకే "చక్ర రాజ నికేతన"తరవాతి నామం "పార్వతి").

330. ఆత్మఘ్నుడు / ఆత్మద్రోహి అనగా ఎవరు?

జ. శరీరము లభించాక కూడా ఆత్మజ్ఞానం తెలుసుకొనుట కొరకు ప్రయత్నించని వాడు ఆత్మఘ్నుడు / ఆత్మద్రోహి అనబడతాడు.

331. "పద్మనయనా"నామానికి అర్థం వివరించండి.

జ. "పద్మనయనా"అంటే పద్మముల వంటి నేత్రములు గల అమ్మ. అమ్మవారి నేత్రాలు సూర్య చంద్రులు. వికసన లక్షణము, గమన (వ్యాపించే) లక్షణము కలవాటిని "పద్మములు"అంటారు. అమ్మ "నేత్రాలకు"ఈ రెండు లక్షణములు ఉన్నాయి, అందుకే "పద్మనయనా".

332. ప్రేతము అనగా ఏమిటి?

జ. చలన రహితమైనదానిని ప్రేతము అంటారు.

333. పంచప్రేతాలు ఏమిటి?

జ. బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వర మరియు సదాశివులు పంచ ప్రేతాలు.

334. పంచప్రేతములు ఏ పనులు చేస్తాయి? అవి చేయించేవారెవరు?

జ. పంచ ప్రేతములు చేసే పనులు - సృష్టి, స్థితి, లయ, తిరోధాన, అనుగ్రహము. అవి పంచప్రేతముల ద్వారా చేసేది / చేయించేది శక్తి స్వరూపిణి అయిన అమ్మవారే.

335. తైత్తిరీయ ఉపనిషత్తు ప్రకారం మనలో ఉన్న పంచ ప్రేతములు ఏమిటి?

జ. తైత్తిరీయ ఉపనిషత్తు ప్రకారం మనలో ఉన్న పంచకోశములే మనలోని పంచప్రేతములు.

336. తైత్తిరీయ ఉపనిషత్తు ప్రకారం వేదాంతము అనగా ఏమిటి?

జ. తైత్తిరీయ ఉపనిషత్తు ప్రకారం పంచకోశ వివేచనమే వేదాంతము.

337. శిష్యుడు అనే వాడు ఏమి చెయ్యాలి?

జ. శిష్యుడు అనేవాడు విచారణ మరియు వివేచన చెయ్యాలి.

338. బ్రహ్మము అనగా ఏమిటి?

జ. దేనివల్ల ఈ ప్రపంచము పుడుతుందో, దేని వల్ల ఈ ప్రపంచము పెరుగుతుందో, దేనిలో ఈ ప్రపంచము లయమవుతుందో అదే బ్రహ్మము.

339. పుచ్ఛము అనగా ఏమిటి?

జ. పుచ్ఛము అనగా "ఆధారము"అని అర్థము.

340. ఆనందమయ కోశము ఏది?

జ. ఆనందము అనుభవిస్తున్నామని భావన కలిగే చోటే ఆనందమయ కోశము.

341. బుద్ధితో ఏమిచేస్తాము?

జ. బుద్ధితో విచారణ చేస్తాము.

342. మనస్సు ఏమి చేస్తుంది?

జ. మనస్సు సంకల్ప, వికల్పములు చేస్తుంది.

343. ధ్యానమనగా ఏమిటి?

జ. బుద్ధిని నిలపటమే ధ్యానం.

344. జ్ఞానము వలన ఏమి తెలుసుకుంటున్నాము?

జ. జ్ఞానము వలన బ్రహ్మమును తెలుసుకుంటున్నాము.

345. ధర్మములు, అధర్మములు ఎవరికి వర్తిస్తాయి?

జ. పంచకోశాలతో ఉన్న జీవునికి ధర్మ అధర్మములు వర్తిస్తాయి. త్రిగుణాలకి అతీతమైన అమ్మవారికి అవి వర్తించవు.

## చంద్ర విద్య

346. ప్రణవంలో ఎన్ని భాగాలు ఉన్నాయి? అవి ఏమి?

జ. ప్రణవంలో నాలుగు భాగాలు ఉన్నాయి అవి, 'అ' కార, 'ఉ' కార, 'మ' కార మరియు తురీయం.

347. మాండూక్యము పైన కారికలు రాసిన వారు ఎవరు?

జ. గౌడ భగవత్పాదుల వారు.

348. జాగ్రదవస్థలో ఏమి పనిచేస్తాయి?

జ. జాగ్రదవస్థలో ప్రాణం, శరీరం, మనసు పనిచేస్తాయి.

349. స్వప్నావస్థలో ఏమి ఉంటుంది?

జ. స్వప్నావస్థలో ప్రాణం, మనస్సు మాత్రమే ఉంటుంది.

350. సుషుప్తిలో ఏమి ఉంటుంది?

జ. సుషుప్తిలో ప్రజ్ఞారూపం అయిన చైతన్యం ఒక్కటే ఉంటుంది.

351. తురీయం అంటే ఏమిటి? ఎవరు ఈ స్థితిలో ఉంటారు?

జ. తురీయం అనగా సమాధి స్థితి, యోగులు మాత్రమే వెళ్ళగలిగే స్థితి.

352. పంచకృత్యాలు అని వేటిని అంటారు?

జ. సృష్టి, స్థితి, సంహారం, తిరోధానం మరియు అనుగ్రహం.

353. అనుగ్రహం అనగా ఏమి?

జ. అనుగ్రహం అనగా అనుసరించి గ్రహించడం.

354. చంద్రమండల విద్య అనగా ఏమి?

జ. చంద్రమండల విద్య అనగా శ్రీచక్రం లో అమ్మవారిని ఆరాధించే విధానం.

355. శ్రీ చక్రం అనగా ఏమి?

జ. శ్రీచక్రం అనగా అమ్మవారు ఉండే చోటు.

356. శ్రీ చక్రంలో త్రికోణాలు అనేకం, అవి ఏమి?

జ. 1). సృష్టి, స్థితి, లయలు 2). సత్వ, రజ, తమో గుణాలు 3). జాగ్రత్, స్వప్న, సుషుప్తులు 4). స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు. ఇలా ప్రపంచంలో కనపడే ప్రతీ "త్రి" యే శ్రీచక్రంలోని త్రికోణాలకి సంకేతం.

## శ్రీ గురువుగారి ఆశీస్సులతో

## Contributors of Sri Lalitha Sahasranama Bhasyam March 2020

| | | |
|---|---|---|
| 1 | Harini Durbhaka | Bharath |
| 2 | Meena Mantha | Bharath |
| 3 | Narasimha Krishna | California |
| 4 | Dharmendra | California |
| 5 | Padma Vennelakanti | Illinois |
| 6 | Chandra Malladi | Michigan |
| 7 | Durga Mahavadi | North Carolina |
| 8 | Madhavi Nandula | Toronto, Canada |
| 9 | Srihari Devalapalli | California |
| 10 | Vally Indraganta / Rama Nagavalli | Bharath |
| 11 | Vasu Marla Garu | Michigan |
| 12 | Balu Prasad Garu | Simi Valley, California |
| 13 | Radhika Kameswari Garu | Arizona |
| 14 | Ravikanth Somaghatta Garu | New Jersey |



సర్వం శ్రీలలితా చరణారవిందార్పణమస్తు